
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
పల్నాడు జిల్లా వార్తలు
5
బుధవారం 29 అక్టోబరు 2025



● నిజాంపట్నం వద్ద 100 మీటర్లపైనే ముందుకు వచ్చి ఎగిసిపడుతున్న సముద్రం



● సూర్యలంక తీరం తుఫాన్ షెల్టర్‌లో పునరావాస కేంద్రంలో భోజనం

వణికించిన మొంథా

మొంథా.. వణికించింది. మంగళవారం రాత్రికి తీరం దాటగా.. అంతకు ముందు.. ఆ తర్వాత జిల్లాలో ఆ ప్రభావం తీవ్రంగా కనిపించింది. మధ్యాహ్నం వరకు ప్రశాంతంగా ఉన్న వాతావరణం ఆ తర్వాత ఒక్కసారిగా మారిపోయింది. అప్పటి వరకు వర్షం పడినా ఆ తర్వాత నుంచి మేఘాలు కమ్ముకు వచ్చి ఈదురు గాలులతో వర్షం పడింది. సాయంత్రానికి గాలులతోపాటు వర్షం కూడా తీవ్రమైంది. పల్నాడు జిల్లాలో కూడా మొంథా ప్రభావం చూపగా.. సముద్రతీరంలోని బాపట్ల జిల్లాను వణికించింది. గుంటూరు జిల్లాలో కూడా తుఫాన్ ప్రభావం కనిపించింది. భారీ వర్షాల హెచ్చరికల నేపథ్యంలో బుధవారం కూడా విద్యా సంస్థలకు అధికారులు సెలవు ప్రకటించారు. లోతట్టు ప్రాంతాలు, గుడిసెల్లోని ప్రజలను అధికారులు పునరావాస కేంద్రాలకు తరలించారు. పంటలు నీటిలో నానుతుండటంతో రైతులు కన్నీటి పర్యంతమవుతున్నారు. తుఫాన్ తీరం దాటినా ఆ ప్రభావం తీవ్రంగా ఉండే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు.



అచ్యుతాపురం-నిజాంపట్నం రోడ్డులో నేలవాలిన వేపచెట్టు



రేపల్లె: పల్లపట్లలో గాలులకు పూరిగుడిసెపై విరిగిపడిన కొబ్బరిచెట్టు



పర్చూరు మండలం ఉప్పుటూరులో నిల్వ ఉంచిన పొగాకు బేళ్ల కిందకు పెద్ద చేరిన వర్షపు నీరు

- ఈదురు గాలులు.. ఓ మోస్తరు వర్షం
- ఉదయం నుంచి కమ్ముకున్న చీకట్లు
- తీరప్రాంత మండలాల్లో అల్లకల్లోలం
- హార్బర్‌లో 8వ ప్రమాద హెచ్చరిక

బాపట్ల, తెనాలి, నరసరావుపేట, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మొంథా తుపాన్ తీరాన్ని వణికిస్తోంది. మంగళవారం మధ్యాహ్నం వరకు ప్రశాంతంగా ఉన్న వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. కమ్ముకొచ్చిన మేఘాలతో చీకట్లు అలుముకున్నాయి. వానకు గాలులు కూడా తోడయ్యాయి. ఇక సముద్ర తీర ప్రాంతంలో 50 నుంచి 80 కిలోమీటర్ల వేగంతో వీచిన గాలులతో తీరప్రాంత మండలవాసులు భయాందోళనకు గురవుతున్నారు. విరామమిస్తూ, ఒక్కొక్కసారి వర్షం విరుచుకు పడుతోంది. దీంతో లోతట్టు ప్రాంతాలు వాన నీటితో నిండిపోయాయి. ఎడతెరపి లేకుండా కురిసిన వర్షాలతో జనజీవనం స్తంభించిపోయింది. తుఫాన్ తీవ్రత విషయంలో అధికారుల హెచ్చరికలతో తీరానికి దూరంగా ఉన్న పల్నాడు, గుంటూరు జిల్లా పరిధిలోని పట్టణాల్లో కూడా ప్రధాన వీధులన్నీ నిర్మానుష్యంగా మారాయి. బాపట్ల జిల్లా పరిధిలోని తీర ప్రాంత సమీప గ్రామాలతో పాటు, బాపట్ల, చీరాల, రేపల్లె తదితర పట్టణాల్లో కూడా ప్రజలు బిక్కుబిక్కుమంటూ ఇళ్లలోనే ఉన్నారు.

ఇక పలు ప్రాంతాల్లోని వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. కొన్ని మండలాల్లో వరి నెలవాలి నీటిలో నానుతుంది. పత్తి, మిరప పొలాలు నీటిలో నానుతున్నాయి. సాయంత్రం నుంచి ప్రారంభమైన ఈదురు గాలులతో అక్కడక్కడ భారీ వృక్షాలు నెలకూలాయి. తుపాన్ తీవ్రత దృష్ట్యా నిజాంపట్నంలో 8వ ప్రమాద హెచ్చరిక ఎగురవేశారు. సోమవారం అంతా మూడో ప్రమాద హెచ్చరికను కొనసాగిస్తే, మంగళశారం ఉదయానికి ఐదో ప్రమాద హెచ్చరిక, మధ్యాహ్నానికి 8వ ప్రమాద హెచ్చరికను ఎగురవేశారు. తీర ప్రాంతాల్లో వర్షం దంచికొట్టింది. తీరానికి (మిగతా 7వ పేజీలో)

సముద్రం ముందుకొచ్చింది..

మొంథా తుపాన్ తీరానికి దగ్గరవుతున్న కొద్దీ సముద్రంలో అలజడులు ఎక్కువయ్యాయి. అలలు ఎగిసిపడుతున్నాయి. నిజాంపట్నం హార్బర్ వద్ద మంగళవారం ఉదయానికి సముద్రం 100 మీటర్లు ముందుకు రాగా, క్రమంగా పెరుగుతూ సాయంత్రానికి 150 మీటర్ల వరకు ముందుకొచ్చింది. చాలావరకు ఒడ్డుకు ఆనుకున్నట్లు కనిపించింది. దీంతో ఎప్పుడు ఎలాంటి ప్రళయం సంభవిస్తుందోనని నిజాంపట్నం, నిజాంపట్నం హార్బర్, దిండి తదితర తీరప్రాంతంలోని గ్రామాల్లోని ప్రజలు భయం గుప్పిట్లో ఉన్నారు. హోరు శబ్దాలతో ప్రజలంతా వణికిపోతున్నారు. బీచ్‌ల వద్ద నిషేధం కొనసాగుతుండటంతో ఆ పరిసర ప్రాంతాలు కర్ఫ్యూను తలపిస్తున్నాయి.



నరసరావుపేట : రావిపాడు సమీపంలో రహదారిపై కూలిన భారీ వృక్షం

జిల్లా అంతటా వర్షాలు

● 40 చోట్ల కమాండ్ కంట్రోలు రూంలు

నరసరావుపేట : తుఫాన్ నేపథ్యంలో మంగళవారం జిల్లా అంతటా ఈదురు గాలులతో విస్తారంగా వర్షాలు కురిశాయి. కలెక్టరేట్, ఆర్డీవో కార్యాలయాలతో పాటు తహసీల్దార్, మున్సిపల్ కార్యాలయాల్లో 40 కమాండ్ కంట్రోలు రూంలు ఏర్పాటు చేసిన అధికారులు ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షిస్తున్నారు. జిల్లాకు ఆరెంజ్ అలర్ట్‌తో బుధవారం కూడా వర్షాలు కొనసాగుతాయన్న వాతావరణ శాఖ ప్రకటనతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

పోలీసులు అప్రమత్తంగా ఉండాలి : ఎస్పీ

తుఫాన్ నేపథ్యంలో అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ కృష్ణారావు ఆదేశించారు. ప్రధాన వాగులు, వంతెనల వద్ద పోలీసు పహరా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో 100, 112కు సమాచారం ఇవ్వాలన్నారు.

నేడూ విద్యాసంస్థలకు సెలవు : కలెక్టర్ కృతికా శుక్లా

భారీ వర్షాలు కురిసే అవకాశం ఉండటంతో బుధవారం కూడా ప్రభుత్వ, ప్రైవేట్, విద్యా సంస్థలకు అంగన్‌వాడీ కేంద్రాలకు సెలవును ప్రకటించినట్లు కలెక్టర్ కృతికా శుక్లా తెలిపారు. లోతట్టు ప్రాంతాలు, గుడిసెల్లో నివసించే వారిని పునరావాస కేంద్రాలకు తరలించాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. 190 పునరావాస కేంద్రాలను గుర్తించి సహాయ చర్యలకు అధికారులు, సిబ్బందిని నియమించామన్నారు. తక్షణ సహాయం కోసం కమాండ్ కంట్రోలు రూం నెంబరు 08647 252999కు కాల్ చేయాలని సూచించారు.

జిల్లాలో వర్షపాతం

జిల్లాలో బుధవారం నమోదైన వర్షపాతం వివరాలు ఇలా ఉన్నాయి. మాచర్ల మండలంలో 14 మీమీ, దుర్గి 14.8, గురజాల 19.8, దాచేపల్లి 12, కారంపూడి 21, పిడుగురాళ్ల 18.6, వెల్దుర్తి, మాచవరం 8.4, బెల్లంకొండ 13.6, అచ్చంపేట 12.4, క్రోసూరు, అమరావతి 8.8, పెదకూరపాడు 13.2, సత్తెనపల్లి 8.2, రాజుపాలెం 7.4, నకరికల్లు 10.2, బొల్లాపల్లి 6.4, వినుకొండ 9, నూజెండ్ల 11.8, శావల్యాపురం 14.4, ఈపూరు 7.6, రొంపిచర్ల 5.8, నరసరావుపేట 9.8, ముప్పాళ్ల 8.6, నాదెండ్ల 15, చిలకలూరిపేట 16.8, రెంటచింతల 4, యడ్లపాడు మండలాల్లో 12.2 మీమీ వర్షపాతం నమోదైంది.

కుడి కాల్వకు నీటి సరఫరా నిలిపివేత


తుఫాను నేపథ్యంలో ముందస్తు చర్యల్లో భాగంగా నాగార్జున సాగర్ నుంచి కుడి కాల్వకు నీటి సరఫరాను జలవనరుల శాఖ నిలిపివేసింది. వర్షాలతో పంటలకు నీరు అవసరం లేదని సదరు అధికారులు తెలిపారు. వర్షాలు పూర్తిగా తగ్గిన అనంతరం నీటి సరఫరాను పునరుద్ధరించనున్నట్లు చెప్పారు.



బాపట్ల: పునరావాస కేంద్రానికి బస్సులో తరలిపోతున్న మూలాపాలెం పంచాయతీలోని కాలనీవాసులు



సూర్యలంక తీరంలో ఏర్పాటు చేసిన వైద్యశిబిరాన్ని పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ విజయమ్మ, సిబ్బంది



ఈపూరు మండలం కొచ్చెర్లలో నెలవాలిన వరి



నరసరావుపేటలో గాలులకు కూలిన విద్యుత్ స్తంభం



వర్షానికి తడిచి కుళ్లిపోతున్న పత్తి కాయలు

హాస్టల్లోనే ఉండాలి

వార్డెన్లు 24 గంటలు

- విద్యార్థుల సంక్షేమంపై దృష్టి సారించాలి
- వసతిగృహాల తనిఖీలో మంత్రి సవిత ఆదేశాలు

సత్తెనపల్లి, రాజుపాలెం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): వసతి గృహ సంక్షేమ శాఖ అధికారులు 24 గంటలు వసతి గృహాల్లోనే ఉండాలని మంత్రి సవిత తెలిపారు. ముప్పాళ్ళ మండలం మాదల, రాజుపాలెంలో శిథిలావస్థకు చేరిన బీసీ వసతి గృహాల్లో మంత్రి మంగళవారం తనిఖీలు చేపట్టారు. ఆయా వసతిగృహాల్లోని గదులను పరిశీలించి విద్యార్థులతో మాట్లాడారు. వసతి పొందుతున్న విద్యార్థుల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ విద్యార్థులకు కాచి చల్లార్చిన నీరు, తాజా ఆహారం ఇవ్వాలని సంక్షేమ అధికారులను ఆదేశించారు. విద్యార్థులకు ఎటువంటి అనారోగ్య సమస్యలు తలెత్తినా తక్షణమే వైద్య సదుపాయం అందించాలన్నారు. విద్యార్థుల సంక్షేమమే లక్ష్యంగా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. విద్యార్థుల చదువుపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ప్రభుత్వం బాలికల విద్యకు కృషి చేస్తుందన్నారు. అధికారులు కూడా విద్యాభివృద్ధికి మరింతగా కృషి చేయాలన్నారు. శిథిలావస్థలో ఉన్న బాలుర, బాలికల వసతి గృహాలకు శాశ్వత భవన నిర్మాణాలకు కృషి చేస్తామన్నారు. మంత్రి తనిఖీ సమయంలో మాదల మహాత్మా జ్యోతిబా పూలే బీసీ వసతి గృహంలో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఇన్వర్టర్లు కేటాయించినా ఎందుకు వాటిని ఏర్పాటు చేయలేదని సంక్షేమాధికారి సుభాషిణిని మంత్రి ప్రశ్నించారు. వైరింగ్ సక్రమంగా లేదని సమాధానమిచ్చారు. ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణతో కలిసి హాస్టల్‌లోనే మంత్రి భోజనం చేశారు. అనంతరం రాజుపాలెంలోని బీసీ బాలుర వసతి గృహాన్ని సందర్శించారు. వసతి గృహంలో 120 మంది ఉన్నారని ఇప్పటికే మరమ్మతులకు రూ.4 లక్షలు మంజూరయ్యాయని అధికారులు మంత్రికి తెలిపారు. మరమ్మతులకు రూపాయి వెచ్చించడం కూడా వృథా అని వెంటనే విద్యార్థులను అద్దె భవనంలోకి మార్చాలని బీసీ సంక్షేమ శాఖ కార్యదర్శి సత్యానారాయణను ఆదేశించారు. కేజీబీవీ విద్యాలయ సమీపంలో బాలికల వసతి గృహాన్ని నిర్మిస్తామని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి పూజల వెంకట కోటయ్య, మండల అధ్యక్షుడు అంచుల నరసింహరావు, మాజీ అధ్యక్షుడు పల్లపాటి పెద్దిరాజు, జనసేన మండల అధ్యక్షుడు తోట నరసయ్య పులిబండ్ల సాంబశివరావు, అంకాళ్ల ప్రభుదాసు, షేక్ అల్లాబక్షు, చొక్కా శ్రీను, చిమట సైదయ్య, జెట్టి కోటేశ్వరరావు, వెంకటేశ్వర్లు, లంకా వీరయ్య, బ్రహ్మయ్య ఉన్నారు.



విద్యార్థులతో కలసి భోజనం చేస్తున్న మంత్రి సవిత, ఎంపీ లావు, ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ తదితరులు

ముప్పాళ్ల ఎంపీపీపై నెగ్గిన అవిశ్వాసం

ముప్పాళ్ళ, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ముప్పాళ్ల మండల పరిషత్ అధ్యక్షురాలు మారూరి పద్మపై అవిశ్వాస తీర్మాన ఉత్కంఠకు మంగళవారం తెరపడింది. ఆర్డీవో రమణాకాంత్ రెడ్డి అధ్యక్షతన అవిశ్వాస నోటీసుపై స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం ప్రత్యేక సమావేశం జరిగింది. మొత్తం 12 మంది ఎంపీటీసీల్లో ఒకరు మృతి చెందగా ఎనిమిది మంది సభ్యులు ఓటింగ్‌లో పాల్గొన్నారు. వీరిలో వైసీపీకి చెందిన ఎంపీటీసీలు పది మంది, జనసేన పార్టీకి చెందిన వారు ఒకరు ఉన్నారు. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత కొంతమంది టీడీపీలో చేరారు. ఈ క్రమంలో ఎంపీపీ మారూరి పద్మపై రుద్రవరం ఎంపీటీసీ కళ్ళం వీరభాస్కర్‌రెడ్డి అవిశ్వాస తీర్మానాన్ని ప్రతిపాదించారు. ఇందుకు అనుకూలంగా ఏడుగురు ఓటు వేశారు. దీంతో పద్మ పదవిని కోల్పోయారు. కాగా ఎంపీపీ మారూరి పద్మతో పాటు ఎంపీటీసీలు షేక్ హుస్సేన్, మేడా వెంకట రమణ సమావేశానికి రాలేదు. త్వరలోనే ఎంపీపీ పదవికి ఎన్నిక నిర్వహిస్తామని ఆర్డీవో ప్రకటించారు. కాగా అవిశ్వాస తీర్మానంపై ఓటింగ్ సందర్భంగా ఎంపీడీవో కార్యాలయం వద్ద ఉత్కంఠ వాతావరణం నెలకుంది. ఈ క్రమంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా రూరల్ సీఐ కిరణ్ బందోబస్తు నిర్వహించారు.



ఎంపీపీ మారూరి పద్మకు వ్యతిరేకంగా చేతులెత్తిన వైసీపీ ఎంపీటీసీలు

అద్భుత కలశమంటూ మోసం

8 మంది అరెస్టు, రూ. 6.50 లక్షలు స్వాధీనం

దుర్గి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): అద్భుత కలశాలు ఉన్నాయని మోసగాళ్లు చెప్పిన మాటలు విని.. వారి వలలో చిక్కుకోవద్దని గురజాల సీఐ ఆవుల భాస్కర్ హెచ్చరించారు. మంగళవారం స్థానిక పోలీస్‌స్టేషన్లో ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రకాశం జిల్లా దర్శి గ్రామానికి చెందిన కట్టా రంగస్వామి, అతని స్నేహితుడు సయ్యద్ బాబు వద్ద విజయవాడకు చెందిన సాడి వెంకటరెడ్డి తన వద్ద శక్తి కలిగిన కలశం ఉందని ఆశ చూపి టోకరా వేసినట్లు తెలిపారు. కలశం విలువ రూ.20 కోట్లు చేస్తుందని.. దానిని అమ్మడానికి పెట్టుబడి పెడితే రెట్టింపు లాభాలు వస్తాయని, అమ్మిన తరువాత డబ్బు తిరిగి ఇస్తానని చెప్పి వారి వద్ద రూ. 15 లక్షలు తీసుకున్నట్లు చెప్పారు. వెంకటరెడ్డి తమను మోసం చేశాడని గ్రహించిన బాధితులు డబ్బులు ఇవ్వాలని అడగగా.. అడిగొప్పుల ఆలయానికి వస్తే డబ్బులు ఇస్తామని రంగస్వామి, సయ్యద్ బాబును సోమవారం అక్కడికి పిలిపించినట్లు పేర్కొన్నారు. వెంకటరెడ్డి తన అనుచరులతో మూడు కార్లలో అక్కడికి వచ్చి తన వద్ద కలశం వారికి చూపించాడన్నారు. ఈ కలశం అమ్మేందుకు మరికొంత డబ్బు పెట్టుబడి పెట్టమని వారిని కోరగా.. బాధితులు డబ్బు లేదని సమాధానం ఇచ్చారని చెప్పారు. తమ డబ్బు తిరిగి ఇవ్వాలని అడిగితే.. వెంకటరెడ్డి, అతని అనుచరులు బాధితులను కొట్టి చంపుతామని బెదిరించినట్లు తెలిపారు. దీంతో రంగస్వామి, సయ్యద్ బాబు దుర్గి పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేయగా.. ఎస్ఐ సుధీర్‌కుమార్ సిబ్బందితో అడిగొప్పులలో వెంకటరెడ్డితోపాటు అతని అనుచరులు ఏడుగురిని అదుపులోకి తీసుకొన్నట్లు వెల్లడించారు. మూడు కార్లు, రూ.6.50లక్షల నగదును స్వాధీనం చేసుకున్నామని సీఐ తెలిపారు. మంగళవారం నిందితులను కోర్టుకు హాజరుపరిచినట్లు తెలిపారు.


గుంటూరు బొంగరాల బీడు పునరావాస కేంద్రంలో భోజనాలు చేస్తున్న ప్రజలు


బుడంపాడు పునరావాస కేంద్రంలో ఉన్న ప్రజలను పరామర్శిస్తున్న జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా


దుగ్గిరాల: ఈమని పునరావాస కేంద్రంలో ప్రజలతో మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్ సంజనాసిన్హా

ఏ మొంథా నష్టం జరగకుండా..


నిజాంపట్నం హార్బర్‌లో జెట్టీలకే పరిమితమైన మెరైన్ బోట్లు


రేపల్లె: పెనుమూడి వద్ద ఈదురు గాలులకు ఊగిపోతున్న కొబ్బరి చెట్లు


కొల్లిపర : మున్నంగి సమీపంలో పడిపోయిన కంద

మొంథా తుపాను ప్రభావం గుంటూరు, బాపట్ల జిల్లాల్లో స్పష్టంగా కనిపించింది. వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో అధికార యంత్రాంగం పూర్తిస్థాయిలో సన్నద్ధమై.. మంగళవారం ఉదయం నుంచే ముందుస్తు చర్యలు తీసుకుంది. తీర ప్రాంత వాసులను పునరావాస కేంద్రాలకు తరలించి, వారికి భోజన, వైద్య సదుపాయాలను కల్పించారు. కలెక్టర్లు కేంద్రాలకు చేరుకుని ఆశ్రయం పొందుతున్న వారితో మాట్లాడారు. వారికి అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. రోడ్లపై విరిగిపడిన చెట్లను సిబ్బంది ఎప్పటికప్పుడు తొలగించి.. ఇబ్బందులు తలెత్తకుండా చేశారు. విద్యుత్ సిబ్బంది నిరంతరం స్పందిస్తూ విద్యుత్ అంతరాయాలను నిరోధించారు. పోలీసు సిబ్బంది వాగులు, బీచ్‌ల వద్ద ప్రజలు ప్రమాదాల బారిన పడకుండా బందోబస్తు నిర్వహించారు. గ్రామ స్థాయి వరకు అధికారులు ప్రతి క్షణం అప్రమత్తంగా ఉండి ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా చర్యలు తీసుకున్నారు. మొత్తంగా ఏమంత నష్టం జరగకుండా పగడ్బందీ ముందస్తు చర్యల్లో అధికార యంత్రాంగం సఫలమైందనే చెప్పాలి.

- ఆంధ్రజ్యోతి, గుంటూరు


నరసరావుపేట: రోడ్డుపై విరిగి పడిన చెట్టును తొలగిస్తున్న రూరల్ ఎస్ఐ కిషోర్


మంగళగిరి పునరావాస కేంద్రంలో బాధితులతో మాట్లాడుతున్న జేసీ శ్రీవాస్తవ

బాధ్యత గల పౌరులుగా ఎదగండి

ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ మధుమూర్తి

తుళ్లూరు, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): ఉన్నత విద్యను పూర్తి చేసిన ప్రతి విద్యార్థి సమాజంలో బాధ్యత గల పౌరులుగా ఎదగాలని ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యామండలి చైర్మన్ ఆచార్య మధుమూర్తి పిలుపునిచ్చారు. జాతి నిర్మాణం, దేశాభివృద్ధిలో భాగస్వామ్యం పెరగాలని కోరారు. మంగళవారం ఉదయం నీరుకొండలోని ఏపీ ఎస్ఆర్ఎం యూనివర్సిటీ 5వ స్నాతకోత్సవంలో డాక్టర్ మధుమూర్తి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. యూనివర్సిటీ కులపతి డాక్టర్ టీఆర్ పారవేందర్ అధ్యక్షతన జరిగిన స్నాతకోత్సవంలో మధుమూర్తి విద్యార్థులకు పలు సూచనలు చేశారు. ఎస్ఆర్ఎం వంటి అంతర్జాతీయ స్థాయి వర్సిటీలో బీటెక్ పూర్తి చేసిన విద్యార్థులకు టీసీఎస్, కాగ్నిజెంట్, గూగుల్ వంటి దిగ్గజ సంస్థలు మెరుగైన అవకాశాలు కల్పిస్తున్నాయన్నారు. స్వర్ణాంధ్ర సాధనలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం విజనరీ 'రోడ్ మ్యాప్ తో ముందుకు సాగుతోందన్నారు. ఎంతో శక్తివంతమైన గూగుల్ ఏఐ డేటా సెంటర్ విశాఖకు మంజూరు కావడం ఎంతో గొప్ప విషయం అన్నారు. రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ తరఫున స్నాతకోత్సవానికి తాను హాజరయ్యానని.. విద్యార్థులకు ఆయన తన అభినందనలను మెసేజ్ ద్వారా పంపారని వివరించారు. యూనివర్సిటీ ఫౌండర్ చాన్సలర్ డాక్టర్ టీఆర్ పారివేందర్ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మంచి విజనరీ లీడర్ అన్నారు చంద్రబాబునాయుడు కోరిక మేరకే ఏపీలో యూనివర్సిటీని ఏర్పాటు చేశామన్నారు. ఇక్కడ చదువుకున్న విద్యార్థులకు విశ్వవ్యాప్తంగా ఎక్కడైనా మంచి ఉద్యోగ అవకాశాలు లభిస్తాయి అన్నారు. యూనివర్సిటీ ప్రెసిడెంట్ డాక్టర్ సత్యనారాయణ మాట్లాడుతూ డిగ్రీలు అందుకున్న విద్యార్థులు వర్సిటీకి మంచి పేరు తీసుకురావాలని కోరారు. శాంతి సహనంతో విజయ సోపానాలు అధిరోహించవచ్చని తెలిపారు. ఈ సందర్భంగా యూనివర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ సతీష్ కుమార్ వార్షిక నివేదికను సమర్పించారు. 2020-25 విద్యా సంవత్సరంలో బీటెక్, పీహెచ్‌డీ, బీఏ, బీకాం చదువులు పూర్తి చేసుకున్న 1,877 మంది విద్యార్థులకు డిగ్రీలు, ఇందులో ప్రతిభ గల విద్యార్థులకు బంగారు, వెండి పతకాలను ప్రదానం చేశారు అనంతరం విద్యార్థులతో కులపతి పారివేందర్ ప్రతిజ్ఞ చేయించారు ఈ కార్యక్రమంలో ఎస్ఆర్ఎం ట్రస్ట్ సభ్యురాలు మణిమంగై, ఎస్ఆర్ఎం గ్రూపు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డి.నారాయణరావు, రిజిస్ట్రార్ డాక్టర్ ప్రేమ్‌కుమార్ డీన్‌లు డాక్టర్ విష్ణుపత్, వినాయక కల్లూరి, డాక్టర్ ఎన్వి రమణరావు, డాక్టర్ రంజిత్ పాల్గొన్నారు.



విద్యార్థులకు డిగ్రీలు ప్రదానం చేస్తున్న విద్యామండలి చెర్మన్ ముధుమూర్తి

చిత్రజ్యోతి

★ SINCE 1965 ★

కొత్త తేదీన ఆర్యన్



విష్ణు విశాల్ కథానాయకుడిగా నటించిన 'ఆర్యన్' చిత్రం విడుదల కొత్త తేదీకి మారింది. ముందు ప్రకటించిన విధంగా ఈ నెల 31న ఈ చిత్రం విడుదలవ్వడం లేదు. ఒక వారం ఆలస్యంగా నవంబర్ 7న 'ఆర్యన్' చిత్రాన్ని విడుదల చేయాలని నిర్ణయించుకున్నట్లు విష్ణు విశాల్ తెలిపారు. 'రవితేజ నటించిన 'మాస్ జాతర', 'బాహుబలి: ది ఎపిక్' చిత్రాలు కూడా ఈ నెల 31న విడుదలవుతున్నాయి. రవితేజతో నాకున్న స్నేహం, రాజమౌళిపై గౌరవంతో ఈ నిర్ణయం తీసుకున్నాం' అని ఆయన తెలిపారు. అయితే 'ఆర్యన్' తమిళ వెర్షన్ మాత్రం ఈ నెల 31నే విడుదలవనుంది. ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్‌గా తెరకెక్కిన 'ఆర్యన్' చిత్రానికి ప్రవీణ్ కె దర్శకుడు. శుభ్ర, ఆర్యన్ రమేశ్ నిర్మించారు. శ్రద్ధా శ్రీనాథ్ కథానాయిక. సెల్వ రాఘవన్ కీలకపాత్ర పోషించారు. శ్రేష్ఠ్ మూవీస్ అధినేత సుధాకర్ రెడ్డి ఈ చిత్రాన్ని తెలుగు రాష్ట్రాల్లో విడుదల చేస్తున్నారు.



ఉగాదిన విడుదల

అడివి శేష్ కథానాయకుడిగా షానియల్ డియో తెరకెక్కిస్తోన్న రొమాంటిక్ యాక్షన్ థ్రిల్లర్ 'డెకాయిట్'. అన్నపూర్ణ స్టూడియోస్ సమర్పణలో సుప్రియ యార్లగడ్డ తెలుగు, హిందీ భాషల్లో నిర్మిస్తున్నారు. సునీల్ నారంగ్ సహ నిర్మాత. మొదట డిసెంబరు 25న విడుదల చేయనున్నట్లు మేకర్స్ ప్రకటించారు. కానీ కొన్ని అనివార్య కారణాల వల్ల వాయిదా పడింది. తాజాగా మేకర్స్ కొత్త తేదీని ప్రకటించారు. 2026 ఉగాది పండగ సందర్భంగా మార్చి 19న థియేటర్లలోకి రానున్నట్లు తెలిపారు. ఈ మేరకు సంబంధిత పోస్టర్‌ని అడివి శేష్ సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. 'ఈసారి మామూలుగా ఉండదు. ముందుకి వెళ్లడమే తప్ప వెనక్కి చూడాల్సిన అవసరమే లేదు' అని క్యాప్షన్ పెట్టారు. కాగా, అడివి శేష్ సరసన కథానాయికగా మృణాల్ ఠాకూర్ నటిస్తున్నారు. బాలీవుడ్ దర్శకుడు, నటుడు అనురాగ్ కశ్యప్ కీలక పాత్రలో కనిపించనున్నారు. ఈ చిత్రానికి భీమ్స్ సిసిరోలియో సంగీతం అందిస్తున్నారు.



శ్రీకాంత్ తివారి వచ్చేస్తున్నాడు



ఓటీటీ ప్లాట్‌ఫామ్‌పై ఓ సరికొత్త ఒరవడిని సృష్టించిన వెబ్ సిరీస్ 'ది ఫ్యామిలీ మ్యాన్'. ఇప్పటి వరకూ రెండు సీజన్లు విజయవంతంగా పూర్తి చేసుకున్న ఈ స్పై యాక్షన్ థ్రిల్లర్ సిరీస్‌లో మూడో భాగం సిద్ధమైంది. మనోజ్ బాజ్‌పాయ్, ప్రియమణి ప్రధాన పాత్రల్లో నటించిన ఈ సిరీస్‌ను రాజ్ అండ్ డీకే తెరకెక్కించారు. ఈ ప్రాజెక్టును ప్రకటించినప్పటి నుంచి స్ట్రీమింగ్ వివరాల కోసం అభిమానులు ఎంతగానో ఆసక్తిగా ఎదురుచూడసాగారు. తాజాగా మేకర్స్ స్ట్రీమింగ్ తేదీని ప్రకటించారు. ఆమెజాన్ ప్రైమ్‌లో నవంబరు 21 నుంచి అందుబాటులోకి రానున్నట్లు వెల్లడించారు. దీనికి సంబంధించిన ఓ వీడియోను కూడా షేర్ చేశారు. థ్రెట్ అనాలిసిస్ అండ్ సర్వైవలెన్స్ సెల్(టాస్క్) సీనియర్ ఆఫీసర్ శ్రీకాంత్ తివారి పాత్రలో మనోజ్ బాజ్‌పాయ్ మరోసారి అలరించనున్నారు. రెండు సీజన్లలో మనోజ్ బాజ్‌పాయ్ నటనకు ప్రపంచవ్యాప్తంగా ప్రశంసలు లభించాయి. ఇప్పుడు మూడో భాగంలో ఆయన నటనపై అభిమానుల్లో అంచనాలు పెరిగాయి. తెలుగు, హిందీ, తమిళం, మలయాళం భాషల్లో ఈ సిరీస్ అందుబాటులో ఉంటుంది.

చట్టమా? విశ్వాసమా?



యామీ గౌతమ్, ఇమ్రాన్ హష్మీ ప్రధాన పాత్రలు పోషించిన చిత్రం 'హక్'. ముస్లిం మహిళల హక్కుల పోరాటంలో మైలురాయిగా నిలిచిన 'మొహమ్మద్ అహ్మద్ ఖాన్ వర్సెస్ షా బానో బేగం' కేసు ఆధారంగా రాసుకున్న కథతో దర్శకుడు సుపర్ణ్ వర్మ ఎస్ తెరకెక్కించారు. నవంబర్ 7న ఈచిత్రం విడుదలవుతోంది. హర్మాన్ బవేజా, విశాల్ గుర్నాని నిర్మించారు. మేకర్స్ మంగళవారం ట్రైలర్‌ను విడుదల చేశారు. చట్టం, విశ్వాసం, న్యాయం మధ్య సంఘర్షణ ప్రధానాంశంగా దర్శకుడు కథను మలచిన తీరు ఆకట్టుకుంటోంది. షాబోనో బేగం పాత్రలో యామీ గౌతమ్, ఆమె భర్తగా ఇమ్రాన్ హష్మీ తమదైన శైలిలో నటించి మెప్పించారు.

నటులకూ ఎనిమిది గంటల షిఫ్ట్ కావాలి



దేశవ్యాప్తంగా సినీ రంగంలో చర్చనీయాంశమైన పనివేళల అంశంపై కథానాయిక రష్మిక మందన్న స్పందించారు. వరుస పాన్ ఇండియా చిత్రాలతో బిజీగా ఉన్న రష్మిక తాను కూడా అధిక పని ఒత్తిడిని అనుభవిస్తున్నట్లు అంగీకరించారు. 'ది గర్ల్‌ఫ్రెండ్' చిత్రం ప్రచార కార్యక్రమాల్లో భాగంగా ఆమె మాట్లాడుతూ... రోజుకు పది పన్నెండు గంటలకు మించి పనిచేయడం ఎంత కష్టమో, కుటుంబ, వ్యక్తిగత జీవితానికి సమయం కేటాయించడం ఎంత అవసరమో ఆమె వివరించారు. 'నేను కూడా ఎక్కువగంటలు పనిచేస్తున్నాను. ఇది ఆరోగ్యానికి మంచిది కాదు. ఇలా చేయవద్దని అందరికీ చెబుతున్నాను. ఆఫీసులో ఉద్యోగులకు ఉన్నట్లే నటీనటులకూ ఎనిమిది గంటల షిఫ్ట్ ఉండాలి' అని రష్మిక అభిప్రాయపడ్డారు. ఒక షెడ్యూల్ పెట్టుకొని రోజుకు 8 గంటలు కంటినిండా నిద్రపోవాలి, వృత్తిని వ్యక్తిగత జీవితాన్ని బేలన్స్ చేసుకోవాలని ఆమె సూచించారు. నిర్ణీత పనివేళల డిమాండ్‌తో దీపికా పదుకొనే కొన్ని సినిమాల నుంచి వైదొలగినప్పటి నుంచి పలువురు నటీనటులు ఈ అంశంపై భిన్నాభిప్రాయాలను వ్యక్తం చేస్తున్నారు.

నా కోసం ఆ వెన్నెల



ప్రేమలోని విభిన్న కోణాలను ఆవిష్కరిస్తూ తెరకెక్కిస్తోన్న చిత్రం 'ఓ చెలియా'. నాగప్రణవ్, కావేరి కర్ణిక, ఆద్య రెడ్డి ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. ఇందిరా దేవి ప్రొడక్షన్స్ పతాకంపై రూపాశ్రీ కొపురు నిర్మిస్తున్నారు. ఎం. నాగ రాజశేఖర్‌రెడ్డి దర్శకుడు. ఇప్పటికే విడుదలైన ప్రచార చిత్రాలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. 'నా కోసం ఆ వెన్నెల' అంటూ సాగే ప్రేమగీతాన్ని నటుడు జేడీ చక్రవర్తి చేతుల మీదుగా మేకర్స్ విడుదల చేశారు. హీరో హీరోయిన్ల అనుబంధాన్ని వివరిస్తూ సాగే ఈ గీతానికి శివ సాహిత్యం అందించగా, ఎం.ఎం కుమార్ స్వరపరిచారు. మేఘన, మనోజ్ ఆలపించారు.

రెహమాన్ సంగీత విభావరి



ప్రముఖ సంగీత దర్శకుడు ఏ.ఆర్.రెహమాన్ తన సంగీత విభావరితో మరోసారి హైదరాబాద్ ప్రేక్షకులను అలరించబోతున్నారు. 'హైదరాబాద్ టాకీస్' ఆధ్వర్యంలో నవంబరు 8న రామోజీ ఫిలిం సిటీలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా తెలుగు ప్రేక్షకులతో తనకున్న అనుబంధాన్ని గుర్తుచేస్తూ ' తెలుగు సినిమాలు చేస్తూనే పెరిగాను. 'ఏ మాయ చేశావే' మొదలు ఇటీవల రామ్ చరణ్ సినిమా వరకు ఇక్కడి ప్రేక్షకులు నన్ను ఎంతగానో ఆదరించారు. ఇప్పుడు హైదరాబాద్ ప్రజలు నా కచేరీని గొప్పగా ఆస్వాదిస్తారని భావిస్తున్నా.' అని అన్నారు. కచేరీలో తన బాణీల గురించి వివరిస్తూ 'నాకు పాత స్వరాలను అనుసరించే సమయం లేదు. కొత్త అనుభూతి కోసం 'రోజా' లాంటి క్లాసిక్స్‌ని డాల్బీ అట్మోస్‌లో రీమిక్స్ చేస్తున్నాను. ఇప్పుడు సంగీతం గ్లోబల్ అయిపోయింది. ఎవరు ఏ భాషలో ఆస్వాదిస్తున్నారో ఎవరూ చెప్పలేరు. సంగీతంలో కొత్తదనం, స్పష్టత ముఖ్యం. అది ప్రేరేపించే భావోద్వేగం అన్నింటి కంటే మరీ ముఖ్యం' అని వివరించారు. కాగా, 2017లో హైదరాబాద్‌లో నిర్వహించిన ఓ భారీ కచేరీలో రెహమాన్ ప్రేక్షకులను 'మా తుజే సలామ్' పాటతో ఉర్రూతలూగించారు. మళ్లీ ఇన్నేళ్లకు సంగీత ప్రియులను అలరించబోతున్నారు.

పలు రైళ్ల రద్దు, దారి మళ్లింపు

గుంటూరు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మొంథా తుపాను కారణంగా మంగళవారం పలు రైళ్లు రద్దయ్యాయి. కొన్నింటిని దారి మళ్లించి దక్షిణ మధ్య రైల్వే నడిపింది. 07060 అనకాపల్లి - సికింద్రాబాద్, 17255 నరసపూర్ - లింగంపల్లి, 12806 లింగంపల్లి - విశాఖపట్టణం జన్మభూమి, 17015 భువనేశ్వర్ - సికింద్రాబాద్ విశాఖ, 22876 గుంటూరు - విశాఖపట్టణం, 22875 విశాఖపట్టణం - గుంటూరు ఉదయ్ ఎక్స్‌ప్రెస్, 17281 గుంటూరు - నరసపూర్, 17016 సికింద్రాబాద్ - భువనేశ్వర్ విశాఖ, 12704 సికింద్రాబాద్ - హౌరా ఫలక్‌నూమా, 17243 గుంటూరు - రాయగడ, 07165 హైదరాబాద్ - భువనేశ్వర్ స్పెషల్, 17215 మచిలీపట్నం - ధర్మవరం, ఈ నెల 29వ తేదీ బుధవారం 17244 రాయగడ - గుంటూరు, 17216 ధర్మవరం - మచిలీపట్నం, 18464 బెంగళూరు - భువనేశ్వర్ ప్రశాంతి, 17256 లింగంపల్లి - నరసపూర్, ఎక్స్‌ప్రెస్ రైళ్లను రద్దు చేశారు. 12703 హౌరా - సికింద్రాబాద్ ఫలక్‌నుమా ఎక్స్‌ప్రెస్‌ని విజయనగరం నుంచే టిట్లాగడ్, రాయిపూర్, బలార్ష, బెల్లంపల్లి, కాజీపేట మీదగా సికింద్రాబాద్‌కు మళ్లించారు. 18048 వాస్కోడిగామ - షాలిమార్ అమరావతి ఎక్స్‌ప్రెస్‌ని 12 గంటల ఆలస్యంగా రీషెడ్యూల్ చేశారు. వీటితో పాటు గుంటూరు - తెనాలి - రేపల్లె, గుంటూరు - విజయవాడ మధ్యన ప్రయాణించే ప్యాసింజర్లలో కొన్నింటిని రద్దు చేశారు.

పలు బస్సు సర్వీసులు రద్దు

● ఆర్టీసీ ఆదాయంపై తీవ్ర ప్రభావం


వెలవెలబోతున్న ఎన్టీఆర్ బస్టాండ్

గుంటూరు, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఆర్టీసీపై మొంథా తుపాను ప్రభావం తీవ్రంగా కనిపిస్తోంది. అడపా దడపా వర్షంతో జిల్లాలో పలు సర్వీసులు సగం మంది ప్రయాణికులతోనే రాకపోకలు సాగించాయి. రెండు రోజులుగా గుంటూరు ఎన్టీఆర్ బస్టాండ్ ప్రయాణికులు లేక బోసిపోతోంది. బుధవారం పూర్తిగా తుపాన్ ప్రభావం పడనున్న నేపథ్యంలో ఆర్టీసీ యంత్రాంగం అప్రమత్తమైంది. గుంటూరు ప్రజా రవాణాధికారిగా (డీపీటీవో) సోమవారం బాధ్యతలు స్వీకరించిన డి.సామ్రాజ్యం వెను వెంటనే తుపాను ప్రభావంపై రూట్ల వారీగా సమీక్షించారు. డీపీటీవో అధికారులకు దిశా నిర్దేశం చేశారు. గుంటూరు-1, 2, మంగళగిరి, తెనాలి, పొన్నూరు డిపోల్లో కూడా సర్వీసులను తగ్గిస్తున్నట్లు డీపీటీవో సామ్రాజ్యం తెలిపారు. తుపాను ప్రభావంతో ప్రజలు కూడా ప్రయాణాలను వాయిదా వేసుకుంటున్నారని, తద్వారా రద్దీ ఉండటం లేదని దాంతో సర్వీసులను తగ్గిస్తున్నట్లు చెప్పారు. అమరావతి, తెనాలి, బాపట్ల, పర్చూరు, మాచర్ల వంటి మార్గాల్లో రహదారుల పరిస్థితి, చప్టాల వద్ద వరద పరిస్థితులను అంచనా వేస్తున్నారు. అందుకు అనుగుణంగా కొన్ని సర్వీసులను రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. ఆర్టీసీ ఆదాయంపై మొంథా తుపాను ప్రభావం పూర్తి స్థాయిలో కనిపిస్తోంది. మరో రెండు రోజులు చార్జీల రూపంలో ఆర్టీసీ ఆదాయానికి గండిపడనుందని అధికారులు అంచనా వేస్తున్నారు.

అమ్మవారి ఆభరణాలు దొంగిలించిన పూజారి


వివరాలు వెల్లడిస్తున్న సీఐ ఉమేష్

తెనాలి క్రైం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): కొల్లిపర మండలం హనుమాన్ పాలెంలోని కాశీ అన్నపూర్ణ సమేత విశ్వేశ్వరస్వామి దేవాలయంలో రూ.20 లక్షలు విలువైన బంగారు ఆభరణాలను ఆలయ పూజారే దొంగిలించాడు. మంగళవారం తెనాలి రూరల్ పోలీస్‌స్టేషన్‌లో విలేకర్ల సమావేశంలో సీఐ ఆర్.ఉమేష్ ఈ కేసు వివరాలను వెల్లడించారు. దేవస్థానంలో పూజారిగా జయరామశర్మ రెండేళ్ల నుంచి పనిచేస్తున్నాడు. అమ్మవారికి భక్తితో భక్తులు బంగారు వడ్డాణం, బంగారపు రాళ్ల గాజులు తదితర రూ.20 లక్షలు విలువైన బంగారు ఆభరణాలు సమర్పించారు. ఈ ఆభరణాలను పూజారి ఒక్కొక్కటిగా తీసుకెళ్లా.. వాటి స్థానంలో బంగారపు మెరుగు అద్దిన ఆభరణాలను ఉంచాడు. దాతలకు పూజా సమయంలో అనుమానం రావడంతో.. వాటిని పరిశీలించి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు విచారణలో ఆ బంగారు ఆభరణాలను పూజారి ఇంటిలో స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి నిందితుడిని జ్యూడిషియల్ రిమాండ్‌కు తరలిస్తున్నట్లు సీఐ తెలిపారు. కొల్లిపర ఎస్ఐ కోటేశ్వరరావు, సిబ్బంది రామకోటేశ్వరరావు, శివరామకృష్ణను ఎస్పీ అభినందించినట్లు సీఐ తెలిపారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి


నవీన్(ఫైల్‌ఫొటో)

మాచవరం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ షాక్‌కు గురై యువకుడు మృతి చెందిన ఘటన మండలంలోని వేమవరం గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. స్థానికుల వివరాలు మేరకు.. గ్రామానికి చెందిన రెంటపాళ్ళ నవీన్(19) పెయింటర్‌గా పని చేస్తుంటాడు. ఉదయం ఓ గృహంలో పెయింట్ పనిచేస్తుండగా.. కింద పడి ఉన్న కరెంటు వైరుపై చూసుకోకుండా కాలు పెట్టాడు. వైరు తెగి ఉండడంతో.. షాక్‌కు గురైన నవీన్ ఒక్కసారిగా కుప్ప కూలిపోయాడు. స్థానికులు మాచవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి అతనిని తరలించగా.. వైద్యులు పరీక్షలు నిర్వహించి నవీన్ మరణించినట్లు నిర్ధారించారు. ఎంపీడీవో విష్ణు చిరంజీవి, ఎస్ఐ విజయ కుమార్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. బంధువుల నుంచి వివరాలు సేకరించారు.

దూర విద్య పీజీ పరీక్ష ఫలితాలు విడుదల

ఏఎన్‌యూ, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం దూర విద్యా కేంద్రం ఎమ్మెస్సీ కెమిస్ట్రీ, కంప్యూటర్ సైన్స్, సైకాలజీ, మ్యాథమెటిక్స్, ఎంసీఏ పరీక్ష ఫలితాలను సంచాలకులు ఆచార్య వి.వెంకటేశ్వర్లు మంగళవారం విడుదల చేశారు. విద్యార్థులు రీ-వాల్యుయేషన్‌కు వచ్చే నెల 11 లోపు దరఖాస్తు చేసుకోవాలని, పేపర్‌కు రూ.960 ఫీజు చెల్లించాలని తెలిపారు. దరఖాస్తులను వచ్చే నెల 15 లోపు దూరవిద్య పరీక్షల సమన్వయకర్తకు పంపాలన్నారు.

భర్తను చంపి సాధారణ మరణంగా చిత్రీకరించిన భార్య

పోస్టుమార్టం నివేదికతో ఐదు నెలలకు వెలుగు చూసిన హత్య


వివరాలు వెల్లడిస్తున్న సీఐ వెంకటేశ్వర్లు, వెనుక నిందితురాలు

గుంటూరు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): తన ఏ సోఫా దిండుతో అయితే భర్త చంపాలనుకున్నాడో.. అదే దిండుతో భార్య తన భర్తను ఊపిరాడకుండా చేసి అంతమొందించింది. దానిని సాధారణ మరణంగా చిత్రీకరించి.. అంత్యక్రియలు కూడా పూర్తి చేసింది. అయితే కుటుంబ సభ్యులకు అనుమానం వచ్చి పోలీసులను ఆశ్రయించడంతో.. నాలుగు నెలల తర్వాత హత్య విషయం వెలుగులోకి వచ్చింది. పట్టాభిపురం సీఐ గంగా వెంకటేశ్వర్లు మంగళవారం పోలీస్ స్టేషన్‌లో విలేకరుల సమావేశం నిర్వహించి, కేసు వివరాలు వెల్లడించారు. నేతాజీ నగర్ 6వ లైనుకు చెందిన షేక్ ఖాజా, హజార భార్యభర్తలు. వారికి అమ్మాయి, అబ్బాయి సంతానం. ఫైనాన్స్ వ్యాపారం, హజార గుజ్జన గుండ్ల సెంటర్‌లో బ్యూటీ పార్లర్ నడుపుతోంది. కొంత కాలంగా భార్యాభర్తల మధ్య డబ్బుల విషయంలో గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో గత జూన్ 19న రాత్రి ఖాజా మద్యం సేవించి తన సంపాదన అంతా భార్య ఖర్చు చేస్తుందని గొడవ పడ్డాడు. భార్య హజారాను కర్రతో కొట్టి, చున్నీతో ఆమె మెడ కేసి బిగించాడు. సోఫాలో కూర్చుని ఉండగా మరోసారి దిండుతో ఆమె ముఖంపై గట్టిగా అదిమి ఆ తర్వాత వదిలేశాడు. ఖాజా ఇంటిలోని మెయిన్ బెడ్ రూంలో భార్యను దుర్భాషలాడాడు. దీంతో హజారా తన భర్తతో విసుగు చెంది, అతను పెట్టే బాధలు భరించలేక భర్తను చంపేయాలని నిర్ణయించుకుంది. రాత్రి సోఫాలో ఉన్న దిండును తీసుకుని బెడ్ రూంలో నిద్రపోతున్న ఖాజా చాతి మీద బలంగా గుద్దింది. మత్తులో ఉన్న భర్త మంచం మీద వెనక్కి పడిపోగా హజారా సోఫా దిండుతో ఖాజా ముఖం మీద గట్టిగా అదమడంతో.. ఊపిరి ఆడక అతను చనిపోయాడు. అనంతరం హజారా ఏమి తెలియనట్టు.. కిందకు వెళ్లి పక్క వీధిలోని ఆర్ఎంపీకి, చుట్టపక్కల వారికి..ఖాజా ఉన్నట్లుండి పడిపోయాడని, ఏమి జరిగిందో తెలియడం లేదని చెప్పింది. తరువాత రోజు హజార భర్త మృతదేహానికి అంత్యక్రియలు చేసేందుకు సిద్ధమైంది. కుటుంబ సభ్యులు ఖాజా మరణంపై జూన్ 20న పట్టాభిపురం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పోస్టుమార్టం నివేదిక మేరకు సోమవారం రాత్రి ఖాజాను చంపిన హజరాను అదుపులోకి తీసుకుని విచారించారు. ఆమె నేరం అంగీకరించడంతో.. సీఐ గంగా వెంకటేశ్వర్లు నిందితురాలిని అరెస్ట్ చేశారు. మంగళవారం కోర్టులో హాజరుపరచగా మేజిస్ట్రేట్ రిమాండ్ విధించారు.

ప్రేమ పేరుతో దగ్గరైన మైనర్లు

● బాలుడిపై పోక్సో కేసు నమోదు

గుంటూరు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ప్రేమ పేరుతో మైనర్ బాలికపై బాలుడు అత్యాచారానికి పాల్పడిన ఘటనపై పట్టాభిపురం పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు వివరాలు.. కోబాల్డ్ పేటకు చెందిన 17 ఏళ్ల బాలికను.. అదే ఏరియాకు చెందిన అదే వయసు గల బాలుడు జనవరి నుంచి ఇన్‌స్టాగ్రాంలో చాటింగ్ చేసుకుంటున్నారు. ఇద్దరూ ప్రేమ పేరుతో దగ్గరయ్యారు. గత జూన్‌లో బాలిక మైనర్ బాలుడు ఇంటికి వెళ్లింది. ఇద్దరూ శారీరకంగా దగ్గరయ్యారు. ఇలా పలుమార్లు జరిగింది. ఈ క్రమంలో బాలిక గర్భందాల్చింది. దీంతో మంగళవారం బాలిక కుటుంబ సభ్యులకు వ్యవహారం తెలియడంతో పట్టాభిపురం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బాలుడిపై పోక్సో కేసు నమోదు చేసి.. బాలికను మెడికల్ పరీక్ష నిమిత్తం గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి పంపించారు.

వైసీపీ కళ్లలో ఆనందం కోసమే జడ శ్రావణ్ వ్యాఖ్యలు

● జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తమ్మిరెడ్డి శివశంకర్


మాట్లాడుతున్న తమ్మిరెడ్డి శివశంకర్

మంగళగిరి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): రాజకీయ స్వలాభం కోసం జనసేన పార్టీ అధ్యక్షుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌పై వ్యక్తిగత విమర్శలకు దిగితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఏపీ ఎంఎస్ఎంఈ చైర్మన్ తమ్మిరెడ్డి శివశంకర్ హెచ్చరించారు. మంగళవారం మంగళగిరిలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, జై భీం పార్టీ అధ్యక్షుడు జడ శ్రావణ్‌కుమార్ వ్యాఖ్యలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. 2021 జనవరిలో మత్స్యకార కుటుంబానికి చెందిన ముప్పల నగేష్ అనే ఇంజనీరింగ్ విద్యార్థి హత్య జరిగితే ఇప్పుడు బురదజల్లే కార్యక్రమం చేయడం ఎవరి మెప్పు కోసమని ప్రశ్నించారు. రణస్థలంలో జరిగిన యువశక్తి కార్యక్రమంలో పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్ ఆ కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకున్నారని తెలిపారు. ఈ కేసును వైసీపీ నాయకులు నీరుగార్చడానికి ప్రయత్నిస్తే పోరాడి హైకోర్టులో కేసు వేసింది జనసేన పార్టీయేనన్నారు. ఏపీ మాల వెల్ఫేర్ కార్పొరేషన్ చైర్మన్ పెదపూడి విజయ్‌కుమార్ మాట్లాడుతూ వైసీపీ ఐదేళ్ల పాలనలో దళితులపై వందల సంఖ్యలో దాడులు, హత్యలు జరిగితే ఎందుకు మాట్లాడలేదని నిలదీశారు. ఏపీఎంఎస్ఐడీసీ చైర్మన్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పేరు మారిన.. ఔరంగబాద్ రైల్వేస్టేషన్

● ఛత్రపతి శంభాజీనగర్‌గా మార్పు

గుంటూరు, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): ఔరంగబాద్ రైల్వేస్టేషన్ పేరుని రైల్వే శాఖ మార్పు చేసింది. ఛత్రపతి శంభాజీనగర్ రైల్వే స్టేషన్‌గా వాడుకలోకి తీసుకొచ్చింది. స్టేషన్ కోడ్ కూడా సీపీఎస్ఎన్‌గా నిర్ణయించింది. ఈ కారణంగా ప్రస్తుతం గుంటూరు - ఔరంగబాద్ మధ్యన ప్రయాణిస్తున్న ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఇక నుంచి గుంటూరు - ఛత్రపతి శంభాజీ నగర్‌గా పేర్లు మారాయి. నాగర్‌సోల్ ఎక్స్‌ప్రెస్ ప్యాసింజర్లు ఈ మార్పుని గమనించాలని దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్‌వో ఎ.శ్రీధర్ విజ్ఞప్తి చేశారు.

యథావిధిగా నేడు జడ్పీ సమావేశం

● ఏర్పాట్లను పరిశీలించిన సీఈఓ

గుంటూరు సిటీ, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం బుధవారం యథావిధిగానే జరుగుతుందని జడ్పీ సీఈఓ వి.జ్యోతి బసు వెల్లడించారు. మొంథా తుపాను నేపథ్యంలో సర్వసభ్య సమావేశం వాయిదా వేస్తారు అన్న ప్రచారం జరిగిన నేపథ్యంలో సీఈఓ స్పందించారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ సమావేశం వాయిదా వేయాలంటే జడ్పీటీసీలు ఆమోదం తెలుపుతూ లేఖ ఇవ్వాలని వెల్లడించారు. వారి నుంచి నుంచి ఏ విధమైన విజ్ఞప్తి అందలేదని తెలిపారు. కాబట్టి ప్రకటించిన రీతిగానే సమావేశం జరుగుతుందని స్పష్టం చేశారు. సమావేశ మందిరంలో ఏర్పాట్లను ఆయన పరిశీలించారు.

అధికారుల హాజరు సందిగ్ధం

ఉమ్మడి గుంటూరు జిల్లాల అధికార యంత్రాంగం మొంథా తుపాను సహాయ చర్యల్లో నిమగ్నం అయ్యింది. ముఖ్యంగా గుంటూరు, బాపట్ల జిల్లాలకు చెందిన అధికారులు క్షణం తీరిక లేకుండా విధులు నిర్వహిస్తున్నారు. ఈ పరిస్థితుల్లో జిల్లా అధికారులు సమావేశానికి హాజరు కావడం కష్టమని తెలుస్తోంది.

లారీ ఢీకొని ద్విచక్ర వాహనదారుడి మృతి


ప్రమాద ఘటనలో జయపాల్

ఫిరంగిపురం, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని వేములూరిపాడు గ్రామం శివారు దర్గా వద్ద మంగళవారం ద్విచక్ర వాహనదారుడిని లారీ ఢీకొనడంతో.. అతను అక్కడికక్కడే మృతి చెందాడు. వివరాల మేరకు.. బొప్పూడి జయపాల్ అనే వ్యక్తి బైక్‌పై గుంటూరు నుంచి స్వగ్రామం కొండవీడుకు వెళ్తుండగా నరసరావుపేట నుంచి వస్తున్న లారీ అతనిని ఢీకొంది. దీంతో జయపాల్ లారీ ముందు భాగంలో ఇరుక్కుపోయాడు. ఫిరంగిపురం ఎస్ఐ నవీన్, ఏఎస్ఐ జాన్ ఖాన్, హెడ్ కానిస్టేబుల్ రత్నరాజు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

వణికించిన మొంథా

(5వ పేజీ తరువాయి)

దూరంగా ఉన్న ప్రాంతాల్లో మాత్రం గాలుల తీవ్రత ఎక్కువగా కనిపించింది. మంగళవారం రాత్రికి మొంథా తీరం దాటే సమయంలో తీవ్రత పెరిగితే 10వ ప్రమాద హెచ్చరిక పెంచే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. రేపల్లె, నిజాంపట్నం, కర్లపాలెం, బాపట్ల, చీరాల పరిధిలోని తుఫాన్ ప్రభావిత గ్రామాల నుంచి జనాన్ని ఇప్పటికే సురక్షిత ప్రాంతాలకు తరలించారు. గుంటూరు జిల్లాలోని కృష్ణానదీ తీరంలోని కొల్లిపర, దుగ్గిరాల తోపాటు, తెనాలి, మంగళగిరి, తాడేపల్లి, పొన్నూరు వంటి పట్టణాల్లో పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేశారు. వర్షం తక్కువగా ఉన్నా, గాలుల తీవ్రత పెరగడంతో విద్యుత్ సరఫరాకు చాలాచోట్ల అంతరాయం ఏర్పడింది. విరిగి పడిన చెట్ల కొమ్మలను, పడిపోయిన విద్యుత్ స్తంభాలను విద్యుత్ సిబ్బంది వర్షంలోనూ ఎప్పటికప్పుడు తొలగించేందుకు చర్యలు చేపట్టారు. వర్షాలు, గాలులతో పంటలకూ నష్టం తప్పడంలేదని రైతులు ఆందోళన చెందుతున్నారు. గుంటూరు జిల్లాలోని తాడేపల్లి, మంగళగిరి, దుగ్గిరాల, తెనాలి, కొల్లిపర, పొన్నూరు, బాపట్ల జిల్లాలోని కొల్లూరు, భట్టిప్రోలు, వేమూరు, చుండూరు, అమృతలూరు వంటి మండలాల్లో అక్కడక్కడ వరి చాపలా నేలపై పరుచుకుపోయింది. లంక గ్రామాల్లోని అరటి, కంద, పసుపు వంటి తోటలు నేలవాలాయి. మంగళవారం రాత్రికి తీరం దాటే నేపథ్యంలో సాయంత్రం నుంచి గాలుల తీవ్రత పెరిగింది. తుఫాన్ పరిస్థితుల దృష్ట్యా దక్షిణ కోస్తా జోన్‌కు ప్రత్యేక అధికారిగా నియమించిన ఆర్‌పీ.సిసోడియా మంగళవారం బాపట్ల కలెక్టరేట్‌కు వచ్చి ఏర్పాట్లపై సమీక్షించారు.

నాగార్జున సాగర్ నీటి నిల్వ 306 టీఎంసీలు

విజయపురిసౌత్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): సాగర్ జలాశయం నీటిమట్టం మంగళవారం నాటికి 588.00 అడుగులు ఉంది. ఇది 306.10 టీఎంసీలకు సమానం. ప్రధాన జల విద్యుత్ కేంద్రం ద్వారా 32,683, ఎస్ఎల్‌బీసీ ద్వారా 600, మొత్తం ఔట్‌ఫ్లో 33,283 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి సాగర్‌కు 34,663 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

0.9841 ఎంయూల విద్యుదుత్పత్తి

రెంటచింతల,అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): సత్రశాలలోని నాగార్జునసాగర్ టెయిల్ పాండ్ విద్యుత్ ప్రాజెక్ట్ రెండు యూనిట్ల ద్వారా సోమవారం అర్ధరాత్రి 12 గంటల వరకు 0.9841 ఎంయూల విద్యుత్‌ను తయారుచేసినట్లు ఎస్ఈ కె.వెంకటరమణ, ఈఈలు సుబ్రహ్మణ్యం, నాగరాజు చెప్పారు. ప్రాజెక్టు 20 రేడియల్ క్రస్ట్ గేట్లకు గాను 2 గేట్లను 1.50 మీటర్లు, ఒక గేట్ 2 మీటర్లమేర ఎత్తి 24,116 క్యూసెక్కులు, టేల్ రేస్ చానల్ ద్వారా 8675 క్యూసెక్కులు మొత్తంగా 32,791 క్యూసెక్కుల నీటిని పులచింతలకు విడుదల చేస్తున్నామన్నారు. ఎగువన సాగర్, ఎత్తిపోతల, హాలియా వాగుల నుంచి 33,657 క్యూసెక్కుల నీరొస్తుందన్నారు. ప్రాజెక్టులో 75.50 మీటర్లమేర నీరుండగా ఇది 7.080 టీఎంసీలకు సమానమని పేర్కొన్నారు.

డెల్టా కాల్వలకు నీటి విడుదల నిలిపివేత

తాడేపల్లి టౌన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ఎగువ ప్రాజెక్టుల నుంచి నీటిని విడుదల చేస్తుండడంతో ప్రకాశం బ్యారేజి వద్ద కృష్ణానది వరద ఉధృతి కొనసాగుతోంది. ఎగువన పులిచింతల ప్రాజెక్టుతోపాటు మున్నేరు, వెలగలేరు, కీసర తదితర ప్రధాన వాగుల నుంచి 82,675 క్యూసెక్కుల వరద నీరు ఇన్‌ఫ్లోగా నమోదు అవుతుండగా, అంతే నీటిని దిగువకు విడుదల చేస్తున్నట్టు ఇరిగేషన్ జేఈ రాజేష్ తెలిపారు. బ్యారేజి రిజర్వాయర్‌లో 11 అడుగుల నీటిమట్టం కొనసాగుతుండగా డెల్టా కాలువలకు నీటి విడుదల నిలిపివేసినట్టు తెలిపారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.75 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	135, 144, 155
చికెన్ విత్ స్కిన్(కిలో)	260.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	270.00

119 పునరావాస కేంద్రాలకు 5,407 మంది


సూర్యలంక సముద్ర తీరంలోని తుపాను షెల్టర్

బాపట్ల, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): తుపాను ప్రభావంతో ప్రాణ నష్టం జరగకుండా అధికార యంత్రాంగం ముందస్తు చర్యలు చేపట్టింది. జిల్లా వ్యాప్తంగా 119 పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేసింది. ఆయా కేంద్రాలకు 5,407 మంది నిరాశ్రయులను తరలించారు. వారికి భోజన సదుపాయం కల్పించారు. జనరేటర్లు ఏర్పాటు చేశారు. సూర్యలంక సముద్ర తీరంలోని తుపాన్ షెల్టర్ పునరావాస కేంద్రంలో తీరం వెంబడి గిరిజన కుటుంబాలను ఉంచారు. ప్రత్యేక వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. ఈ కేంద్రాన్ని మంగళవారం డీఎంఅండ్ హెచ్‌వో డాక్టర్ ఎస్.విజయమ్మ సందర్శించారు. విద్యుత్ ఎస్ఈ ఆంజనేయులు ఆప్రాంతాన్ని పరిశీలించి, విద్యుత్ సమస్య తలెత్తకుండా సిబ్బందికి సూచించారు. రూరల్ సీఐ శ్రీనివాసరావు తీరంలో భద్రతా చర్యలు చేపట్టారు. సముద్రానికి ప్రజలు రాకుండా ప్రత్యేక గస్తీ ఏర్పాటు చేశారు. జమ్ములపాలెం జడ్పీ ఉన్నత పాఠశాలలోని పునరావాస కేంద్రంలో జేసీఎన్ఎంఎం సర్వీస్ సొసైటీ అధ్యక్షుడు కన్నెగంటి జాన్‌వెస్లీ, గ్రామకార్యదర్శి మరియమ్మతో కలిసి నిరాశ్రయులకు భోజన ఏర్పాట్లు చేశారు.

కొండవీటి వాగు పరివాహక.. ప్రాంతాలను పరిశీలించిన ఏడీసీ బృందం


కొండవీటి వాగును పరిశీలిస్తున్న ఏడీసీ చైర్‌పర్సన్ లక్ష్మీ పార్థసారథి

తుళ్లూరు, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): మొంథా తుపాను ప్రభావంతో ఎగువ నుంచి కొండవీటి వాగుకు వరద నీటి తాకిడి ఉన్నందున అమరావతి అభివృద్ధి సంస్థ (ఏడీసీ) చైర్‌పర్సన్, మేనేజింగ్ డైరక్టర్ డి.లక్ష్మీపార్థసారథి మంగళవారం కొండవీటి వాగు పరివాహక ప్రాంతాలను ఇంజనీరింగ్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఎగువ నుంచి కొండవీటి వాగులో నీటి ఉధృతి పెరిగే క్రమంలో ప్రవాహానికి ఎక్కడా అంతరాయం కలుగకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. ముఖ్యంగా కొండవీటివాగు దాటుకొని వెళ్లే నీరుకొండ, కురగల్లు, ఎన్-6 పశ్చిమ బైపాస్, ఈ-10 రహదార్ల వద్ద వాగు వొంపులుగా ఉన్న ప్రదేశాల్లో అడ్డంకులు లేకుండా చూడాలన్నారు. ప్రధానంగా అమృత విశ్వ విద్యాలయం వద్ద ప్రవాహం తీరు వేగంగా జరిగే విధంగా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. పాలవాగు కొండవీటి వాగులో కలిసే కృష్ణాయపాలెం వద్ద స్వీయపరిశీలన జరిపారు. కొండవీటి వాగు కృష్ణా నదిలో కలుస్తున్న ఉండవల్లి ఇరిగేషన్ పంపింగ్ స్టేషన్‌ను పరిశీలించారు. వరద నీటి ఎత్తిపోత పరిస్థితిని సమీక్షించారు. కొండవీటి వాగు పరివాహక ప్రాంతంలో ఇంజినీర్లు అనుక్షణం వరద నియంత్రణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పర్యటనలో ఈఎన్‌సీ ఆర్.గోపాలకృష్ణారెడ్డి, చీఫ్ ఇంజినీర్లు బి.నరసింహమూర్తి, సిహెచ్.ధనుంజయ, ఇంజినీరింగ్ బృందం పాల్గొన్నారు.

సత్యదేవుడి సన్నిధిలో డీఎస్పీల జంట పూజలు


వేదాశీర్వచనం పొందిన డీఎస్పీలు

అన్నవరం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ఇద్దరు డీఎస్పీలు ప్రేమించి పశ్చిమ గోదావరి జిల్లాలో ఒక్కటైన జంట మంగళవారం కాకినాడ జిల్లా అన్నవరం సత్యదేవుడి సన్నిధిలో వ్రతమాచరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రస్తుతం కృష్ణాజిల్లా అవనిగడ్డ డీఎస్పీగా పనిచేస్తున్న విద్యశ్రీ, పల్నాడు జిల్లా గురజాల డీఎస్పీగా పనిచేస్తున్న జగదీష్ గత కొంతకాలంగా ప్రేమించుకుంటున్నారు. ఇరుపెద్దల అంగీకారంతో వారు ఒక్కటయ్యారు. వారికి ఆలయ అధికారులు ఏర్పాట్లు చేయగా దర్శనం అనంతరం వేదపండితులు వేదాశీర్వచనాలు అందజేశారు. ఒకే క్యాడర్ పోలీస్ అధికారుల ప్రేమ వివాహం విశేషంగా మారింది.

14 ఏఓ, 28 మంది డిప్యూటీ ఎంపీడీఓలకు పదోన్నతులు

అమరావతి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖలో పదోన్నతుల ప్రక్రియ కొనసాగుతోంది. 14 మంది అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్లు, 28 మంది డిప్యూటీ ఎంపీడీఓలకు ఎంపీడీఓలుగా పదోన్నతులు కల్పిస్తూ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ మంగళవారం ఉత్తర్వులు జారీచేసింది. ముఖ్యంగా అనంతపురం జిల్లాలో ఎక్కువ మంది అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్లు, డిప్యూటీ ఎంపీడీఓలకు పదోన్నతులు దక్కాయి. రాయలసీమ ప్రాంతంలో ఖాళీలు లేకపోవడంతో పలువురిని కృష్ణా, ఏలూరు, గోదావరి జిల్లాల్లో పదోన్నతులపై బదిలీ చేశారు. ఈ ప్రక్రియ పూర్తి కావడంతో తదుపరి డిప్యూటీ ఎంపీడీఓ, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ పోస్టుల ఖాళీలను పంచాయతీ కార్యదర్శి గ్రేడ్-1 ఉద్యోగులకు పదోన్నతులు కల్పించి భర్తీ చేస్తారు.

స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్‌కు ఆరుగురు కన్సల్టెంట్లు

అమరావతి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛభారత్ అర్బన్-2.0 అమలుకు రాష్ట్ర స్థాయి ప్రాజెక్టు మేనేజ్‌మెంట్ యూనిట్‌ను ఏర్పాటు చేయడానికి నేషనల్ ఇన్‌ఫర్మేటిక్ సెంటర్ సర్వీసెస్ ఇన్‌కార్పొరేటివ్(ఎన్ఐసీఎస్ఐ) ఎంప్యానెల్ చేసిన ఏజెన్సీ ద్వారా ఆరుగురు కన్సల్టెంట్లను నియమించుకునేందుకు మున్సిపల్ శాఖ అనుమతించింది. వీరిని 12 నెలల పాటు నియమించుకోవడానికి అనుమతిస్తూ మున్సిపల్, పట్టణాభివృద్ధిశాఖ ఉత్తర్వులు జారీచేసింది. స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఎండీ ఆ మేరకు చర్యలు తీసుకోవాలని, వారికి వేతనాలు ఎన్ఐసీఎస్ఐ ఆమోదించిన రేట్ల ప్రకారం ఉండేలా చూడాలని సూచించింది. వారి వేతనాల కోసం చేసే వ్యయం స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ స్వచ్ఛభారత్ మిషన్ నిధుల నుంచి భరిస్తారు.

ఎంఎస్ఈలకు రూ.10 కోట్ల అదనపు నిధులు

అమరావతి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని మైక్రో అండ్ స్మాల్ ఎంటర్‌ప్రైజెస్ (సీజీఎస్-ఎంఎస్ఈ) పథకం కింద 2025-26 ఆర్థిక సంవత్సరానికి కార్పస్ ఫండ్ చెల్లింపునకు రాష్ట్ర ప్రభుత్వం రూ.10 కోట్లు అదనపు నిధులు మంజూరు చేసింది. ఈ మేరకు రాష్ట్ర పరిశ్రమల శాఖ కార్యదర్శి ఎన్.యువరాజ్ మంగళవారం ఉత్తర్వులు విడుదల చేశారు.

సమగ్ర కులగణనకు పూనుకోవడం హర్షణీయం

● బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కేసన శంకరరావు

మంగళగిరి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సమగ్ర కులగణన చేపట్టేందుకు కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడాన్ని బీసీ సమాజం హర్షిస్తుందని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మూడు దశాబ్దాలుగా బీసీ సంఘాల పోరాట ఫలితంగా జాతీయ స్థాయిలో జనగణనతో పాటే సమగ్ర కులగణనకు మోదీ ప్రభుత్వం ముందుకు రావడాన్ని బీసీల చారిత్రాత్మక విజయంగా భావిస్తున్నామని తెలిపారు. నవంబరు 7 నుంచి సమగ్ర కులగణన నిర్వహించేందుకు సిద్ధపడిన సీఎం చంద్రబాబు నాయుడుకు ధన్యవాదాలు తెలిపారు. సుప్రీంకోర్టు చెప్పిన విధంగా 50 శాతం పరిమితిని అధిగమించేందుకు పార్లమెంటుచే రాజ్యాంగ సవరణ చేయించి, షెడ్యూల్డ్-9లో పెట్టించాలని శంకరరావు కోరారు.

పల్నాడు వార్తలు

మాచర్ల ◆ గురజాల ◆ సత్తెనపల్లి ◆ పెదకూరపాడు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్

ప్రజల భద్రతకు ప్రాధాన్యమివ్వాలి

● ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్

పెదకూరపాడు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని నాయ కులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పని చేస్తూ తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో పరిస్థితులను నిరంతరం పర్యవేక్షిస్తూ ప్రజల భద్రతకు ప్రాధాన్యమివ్వాలని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ సూచించారు. గుంటూరులోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంగళవారం తుఫాన్ పరిస్థితులను సమీ క్షించేందుకు కార్యాలయ సిబ్బందితో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రవీణ్ మాట్లాడుతూ నియోజకవర్గంలోని నాయకులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పని చేస్తూ ప్రజలకు ఎలాంటి నష్టం జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని అన్నారు. అధికారులు, నాయకులు ప్రజల మధ్య వారధిగా వ్యవహరించి సమస్యలు ఏమైనా ఉన్నా తక్షణమే పరిష్కరించాలని సూచించారు. అత్యవసర పరిస్థితులు ఏమైనా ఉన్నా ఆయా మండలాలకు చెందిన హెల్ప్‌లైన్ నెంబర్లు అమరావతి - 9505857419, పెదకూరపాడు - 9949098618, అచ్చంపేట - 9959714218, క్రోసూరు - 8500513410, బెల్లంకొండ - 96524443666లలో అత్యవసర పరిస్థితులు వస్తే సంప్రదించాలని ఆయన కోరారు.

పీహెచ్‌సీని సందర్శించిన డీఎంహెచ్‌వో



పీహెచ్‌సీలో నాయకులతో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో డాక్టర్ సీహెచ్ రవి

అచ్చంపేట, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : అచ్చంపేటలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని మంగళవారం డీఎం హెచ్‌వో డాక్టర్ సీహెచ్ రవి సందర్శించారు. పీహెచ్‌సీలోని ల్యాబ్ రూమ్, విద్యుత్ సరఫరా తదితర వాటిని పరిశీలించి గర్భిణుల వివరాలను, రికార్డులను పరిశీలించారు. అత్యవసర పరిస్థితులు ఎదురైనప్పుడు వెంటనే చర్యలు తీసుకొనే విధంగా సిబ్బందికి సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా పలువురు టీడీపీ నాయకులతో సమీక్ష నిర్వహించారు. ఆయనతో ఎంపీడీవో కోయ శ్రీనివాసరావు, టీడీపీ జిల్లా కార్యదర్శి పాటిబండ్ల బాపిరాజు, మండల అధ్యక్షుడు నందిగం ఆశీర్వాదం, ఎంపీపీ భూక్యా స్వర్ణమ్మ రమేష్‌నాయక్, డాక్టర్ సీహెచ్ స్రవంతి, హెల్త్ ఎడ్యుకేటర్ కే పార్వతిలతో తుఫాన్ పరిస్థితులపై మాట్లాడారు.

విద్యుత్ సమస్యలను నివారించేందుకు చర్యలు

● ఈఈ సింగయ్య

మాచర్ల, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ వలన ఏర్పడే కరెంట్ సమస్యలను పరిష్కరించేందుకు మాచర్ల డివిజన్ పరిధిలో 160 స్తంభాలను సిద్ధం చేశామన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ప్రతి సబ్ డివిజన్ పరిధిలో 40 స్తంభాలను సిద్ధంగా ఉంచామన్నారు. తుఫాన్ వలన స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు పడిపోవడం, విద్యుత్ తీగలు తెగిపడడం వంటి సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. ఈ మేరకు డివిజన్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామన్నారు. కరెంట్ స్తంభాలు ఒరిగిపోవడం, విద్యుత్ వైర్లు తెగిపోవడం వంటివి గమనిస్తే సెల్ : 9440817531కు సమాచారం అందించాలన్నారు. ప్రజలు విద్యుత్ వైర్లను తాకవద్దని, అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

సురక్షిత కేంద్రాలకు 25 కుటుంబాల తరలింపు



పెదమద్దూరు పునరావాస కేంద్రంలో బాధితులతో మాట్లాడుతున్న తహసీల్దార్ డానియేలు, సీఐ అచ్చియ్య తదితరులు

అమరావతి, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావంతో లోతట్టు ప్రాంతాల్లో నివాసం ఉంటున్న ప్రజలను ముందస్తు భద్రతా చర్యల్లో భాగంగా పెదమద్దూరు, మల్లాది, అమరావతి గ్రామాల్లో 25 కుటుంబాలను పునరావాస కేంద్రాలకు తరలించి వారికి సదుపాయాలు కల్పించినట్లు తహసీల్దార్ డానియేలు తెలిపారు. తహసీల్దార్‌తో పాటు సీఐ అచ్చియ్య, ఎస్ఐ రాజశేఖర్, ఆర్ఐ శిరోమణి, రెవెన్యూ సిబ్బందితో కలసి పెదమద్దూరు వాగు, పునరావాస కేంద్రాలను పరిశీలించారు. తహసీల్దార్ కార్యాలయంలో సమాచార కేంద్రాన్ని ఏర్పాటు చేసి గ్రామాల వారీగా అధికారులను అప్రమత్తం చేసి సమాచారాన్ని సేకరిస్తున్నారు.

తుఫాన్ ప్రభావంపై టీడీపీ శ్రేణులతో సమావేశం

బెల్లంకొండ, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ ప్రభావం వల్ల మండలంలోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని టీడీపీ మండల అధ్యక్షుడు అక్కల వెంకట రామిరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం బెల్లంకొండ టీడీపీ కార్యాలయంలో కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేశారు. మండలంలోని ప్రతి గ్రామానికి పంచాయతీ కార్యదర్శి, వీఆర్వో, విద్యుత్ సిబ్బంది, పోలీసు సిబ్బందిని ప్రజలకు అందుబాటులో ఉండేవిధంగా చర్య లు చేపట్టిందని పేర్కొన్నారు. బెల్లంకొండలో తహసీల్దార్, ఎంపీడీవో, ఎస్ఐ, విద్యుత్ ఏఈ, మండలస్థాయి అధికారులు ఉంటారని, ఏ సమస్యలు వచ్చి నా అధికారుల దృష్టికి తీసుకువెళ్లాలని అయన పేర్కొన్నారు. ఈ సమావేశం లో మాజీ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, రాష్ట్ర మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి మస్తాన్ షరీఫ్, ఆకుల జగన్, ఉర్సు ఆనంద్, డాక్టర్ హనుమంతరావు, బెల్లంకొండ సర్పంచ్ జ్యోతి సముద్రం, తదితరులు పాల్గొన్నారు.

అచ్చంపేటలోని మండలంలో ..



అచ్చంపేటలో తుఫాన్ కంట్రోల్ రూమ్ వద్ద అధికారులతో టీడీపీ నాయకులు

అచ్చంపేట, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : అచ్చంపేటలోని మండల పరిషత్ కార్యాలయం వద్ద మొంథా తుఫాన్ కారణంగా కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు. ఈ రూమ్‌ను తెలుగుదేశం పార్టీ నాయకులు పరిశీలించి అధికారులతో మాట్లాడారు. తుఫాన్ కారణంగా ఎలాంటి పరిస్థితులు ఎదురైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నట్టు ఎంపీడీవో కోయా శ్రీనివాసరావు తెలిపారు. ముందుగా ప్రజలకు తుఫాన్‌పై అవగాహన కల్పించారు. ఎంపీడీవో పాటు టీడీపీ మండల అధ్యక్షుడు నందిగం ఆశీర్వాదం, పాటిబండ్ల బాపిరాజు, ఎంపీపీ భూక్యా స్వర్ణమ్మ రమేష్ నాయక్, కోటా చంటి, మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది రమేష్ తదితర నాయకులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి జనసేన నేత ఆర్థికసాయం

మాచర్ల రూరల్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వీరభద్రస్వామి దేవాలయం సమీపంలో గల జనసేన నేత మోడేపల్లి సంతోష్ కుటుంబాన్ని మంగళవారం న్యాయవాది, జనసేన నేత బత్తుల బాబురావు పరామర్శించారు. సంతోష్ కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతుండడంతో పరామర్శించి రూ.5 వేల ఆర్థికసాయం అందించారు. కష్టకాలంలో పార్టీ నేతలను ఆదుకునేందుకు జనసేన పార్టీ సిద్ధంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో కొమెర అమరయ్య, చరకా బాలయ్య, ఉప్పుతోళ్ల ప్రసాద్, కొమెర శ్రీను, బత్తుల శివ తదితరులు పాల్గొన్నారు.

అప్రమత్తతతో ఎదుర్కొందాం.. అధైర్యపడొద్దు

● ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి



ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి



సత్రశాలలో నీట మునిగిన పుష్కర ఘాట్

మాచర్ల, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మొంథా తీవ్ర తుఫాన్ ప్రభావంపై కూటమి ప్రభుత్వం అప్రమత్తంగా ఉందని, నియోజకవర్గ ప్రజలు అధైర్య పడవద్దని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ వాతావరణ శాఖ, విపత్తుల నిర్వహణ సంస్థ సంయుక్త ఆధ్వర్యాన ఇచ్చిన నివేదికల ఆధారంగా అధిక వర్షపాతంతో కలిగే నష్టాన్ని ఇప్పటికే అంచనాకు ప్రభుత్వం వచ్చిందని, ఏపీ సచివాలయం నుంచి సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, మంత్రి లోకేశ్‌లు నిత్యం సమీక్షిస్తున్నారన్నారు. ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా టోల్‌ఫ్రీ నంబర్లను ప్రభుత్వం జారీ చేసిందని, ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే నియోజకవర్గంలోని అన్ని మండలాల అధికారులను అప్రమత్తం చేశామని, కలెక్టర్ కృత్తికా శుక్లా నేతృత్వంలో నిత్యం మానిటరింగ్ జరుగుతోందని వివరించారు. తుఫాన్ బాధితుల సాయం కోసంకలెక్టర్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని, మండలాల వారీగా కంట్రోల్ రూం అధికారులను నియమించామని, 24 గంటలు అధికార యంత్రాంగం సహాయక చర్యలు అందిస్తారన్నారు. కారంపూడి మండల ప్రజలు సెల్ : 7093004566, దుర్గి : 9573271041, రెంటచింతల : 9989991002, వెల్దుర్తి : 6300502015, మాచర్ల : 6302817715, మాచర్ల మున్సిపాలిటీ : 9849905838లను సంప్రదించాలని ఎమ్మెల్యే సూచించారు.

నీటి విడుదల పరిమాణం పెంచితే సమాచారమివ్వాలి

రెంటచింతల అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): సత్రశాలలోని టెయిల్‌పాండ్ విద్యుత్ ప్రాజెక్టు రేడియల్ క్రస్ట్ గేట్ల నుంచి నీటి విడుదల పరిమాణం పెంచినట్లయితే ఆ సమాచారాన్ని అటు రెవెన్యూ అధికారులకు ఇటు ఎండోమెంట్ అధికారులకు తెలియజేయాలని ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి కోరారు.

మంగళవారం ఎండోమెంట్ ఈవో గాదే రామిరెడ్డితో పాటు ప్రాజెక్టు ఎస్ఈ కె.వెంకటరమణతో ఫోన్లో మాట్లాడి పలు సూచనలు చేశారు. తుఫాన్ నేపథ్యంలో సాగర్ నుంచి అనూహ్యంగా నీటి విడుదల పెరిగితే అదనపు క్రస్ట్ గేట్లు ఎత్తే క్రమంలో దిగువ స్థాయి ఎండోమెంట్ సిబ్బందిని అప్రమత్తం చేయలన్నారు. ఇప్పటికే పుష్కర ఘాట్లు నీటిలో మునిగాయని వివిధ మాలలు ధరించిన భక్తులు జాగరూకతతో వ్యవహరించాలని ఆయన అన్నారు.

లోతట్టు ప్రాంతాల్లో ఆర్డీవో పర్యటన



పట్టణంలో పర్యటించిన ఆర్డీవో రమణాకాంత్‌రెడ్డి

సత్తెనపల్లి, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): తుఫాన్ నేపథ్యంలో మంగళవారం ఆర్డీవో రమణాకాంత్‌రెడ్డి, తహసీల్దార్ చక్రవర్తి, ఇతర అధికారులు పట్టణంలోని పలు లోతట్టు ప్రాంతాలను పరిశీలించారు. ప్రజలకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. లోలెవల్ చప్టాలను పరిశీలించారు. నీటి ప్రవాహం త్వరగా వెళ్లేలా జేసీబీ సహకారంతో లోలెవల్ ప్రాంతాల్లోని వ్యర్థాలను, లోలెవల్ చప్టాల ప్రాంతాల్లోని వ్యర్థాలను తొలగింప చేశారు. అత్యవసరమైతే తప్పితే ప్రజలు బయటకు రావద్దని సూచించారు. తుఫాన్ నేపథ్యంలో విద్యుత్‌శాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. ప్రజలకు సూచనలు చేశారు.

ముంపు ప్రాంతాల పర్యవేక్షణ



వెంకటరావు కాలనీని పరిశీలిస్తున్న ఆర్డీవో మురళీకృష్ణ

గురజాలటౌన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో రెండు రోజులుగా కురుస్తున్న మొంథా తుఫాన్ కారణంగా కురుస్తున్న వర్షానికి లోతట్లు ప్రాంతాలు జలమయమయ్యాయి. మంగళవారం ఈ ప్రాంతాలను గురజాల ఆర్డీవో మురళీకృష్ణ పరిశీలించారు. పట్టణంలోని వెంకటరావుకాలనీని పరిశీలించారు. వర్షం ఎక్కువైతే దండివాగు నీరొస్తే ముందస్తు జాగ్రత్త తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అలాగే మండలంలోని మాడుగుల గ్రామం ముందు ఉన్న ఎద్దుల వాగును పరిశీలించారు. వాగు పొంగి పొర్లితే వాగును ఎవరూ దాటరాదని, బందోబస్తు నిర్వహించాలని సూచించారు. అత్యవసరమైతే తప్ప ఇంటి నుంచి బయటకు రావొద్దన్నారు. ఆర్డీవో వెంట తహసీల్దార్ దుర్గేశ్వరరావు, మున్సిపల్ కమిషనర్ శివన్నారాయణ, టీడీపీ నేత నేలవల్లి బొల్లయ్య తదితరులు ఉన్నారు.

తుఫాన్ దృష్ట్యా కంట్రోల్ రూమ్ ఏర్పాటు

● తహసీల్దార్ వెంకటేశ్వరనాయక్



కారంపూడి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ దృష్ట్యా స్థానిక మండల రెవెన్యూ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్ వెంకటేశ్వరనాయక్ అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ తుఫాన్ తీరం దాటుతున్న సమయంలో 100 కి.మీ.ల వేగంతో గాలులు, భారీ వర్షాలు నమోదవుతున్న దృష్ట్యా ఆ ప్రభావం గ్రామాలపై ఉంటుందన్నారు. పరిశీలకుల అంచనాల మేరకు ప్రభుత్వం ముందస్తు చర్యలు తీసుకుందన్నారు. మట్టి మిద్దెలు, గుడిసెలు, రేకులషెడ్లలో ఉండవద్దన్నారు. నాగులేటి పరిసర ప్రాంతంలో నివసించే వారు కూడా ఆ ప్రాంతాన్ని వదిలి గ్రామాల్లోకి వెళ్లాలన్నారు. రెవెన్యూ సిబ్బంది ఎప్పటికప్పుడు గ్రామాల్లో జరిగే ఘటనలను అధికారులకు తెలియజేయాలన్నారు. పశుసంపదను జాగ్రత్తగా కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ప్రమాదం జరిగిన వెంటనే కంట్రోల్ రూమ్ నెంబర్ 7093004566కు సమాచారం అందించాలన్నారు.

ముళ్లకంప తొలగింపు



గోలి వాగు ప్రవాహానికి అడ్డుగా ఉన్న ముళ్లకంపను తొలగిస్తున్న దృశ్యం

రెంటచింతల, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ తీవ్రత నేపథ్యంలో పొంగుతున్న వాగులు వంకలు దాటడానికి పాదచారులు, వాహనచోదకులు ప్రయత్నించొద్దని ఆర్అండ్‌బీ ఏఈ యూసఫ్ కోరారు. మంగళవారం మండలంలోని గోలి గ్రామ సమీపంలోని గోలి వాగును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏడుమంగళం, గోలి వాగు, పిల్లి వాగుల వద్ద నీరు ఉధృతంగా ప్రవహిస్తున్న నేపథ్యంలో, వాగుల వద్ద ఎటువంటి ఇబ్బందులు ఏర్పడినా కమాండ్ కంట్రోల్ రూమ్ నెంబర్ 9492469512లకు ఫోన్ చేయాలని ఏఈ యూసఫ్ చెప్పారు. గోలి వాగు వరద ప్రవాహానికి అడ్డంగా ఉన్న ముళ్ల కంపను మంగళవారం ఆర్అండ్‌బీ ఏఈ యూసఫ్ దగ్గరుండి తొలగించి ప్రవాహానికి అడ్డంకులు లేకుండా చేశారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

● తెలుగుయువత మైనార్టీ నేత మోసిన్

మాచర్ల, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ ప్రభావం తీవ్ర స్థాయిలో ఉంటుందన్న వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలుగుయువత మైనార్టీ నేత షేక్ మోసిన్ అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ శిథిలావస్థలో ఉన్న భవనాలు, గృహాల్లోని వ్యక్తులను, లోతట్టు ప్రాంతాల ప్రజలు సురక్షిత ప్రాంతాలకు చేరుకోవాలన్నారు. నదులు, వాగుల్లోకి వెళ్లవద్దన్నారు. తీవ్ర గాలుల సమయంలో ప్రజలు ఇంటి వద్ద నుంచి బయటకు రావొద్దన్నారు. కూటమి ప్రభుత్వంపై బురద జల్లేందుకు వైసీపీ ఎదురుచూస్తోందని ఆరోపించారు.

అంగన్‌వాడీ కేంద్రంలో ఎంపీడీవో తనిఖీ



అంగన్‌వాడీ కేంద్రంలో రికార్డులను పరిశీలిస్తున్న ఎంపీడీవో విష్ణు చిరంజీవి

మాచవరం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వేమవరంలో అంగన్‌వాడీ కేంద్రాన్ని ఎంపీడీవో విష్ణు చిరంజీవి మంగళవారం తనిఖీ చేశారు. కేంద్రానికి సంబంధించి అన్ని రికార్డులను పరిశీలించారు. చిన్నారులకు ఇస్తున్న పోషకాహార పదార్థాల గురించి అంగన్‌వాడీ టీచర్ కోడిరెక్క పెద్దమ్మాయిని అడిగి తెలుసుకున్నారు. రికార్డులు ఎప్పటికప్పుడు పూర్తి చేయాలని, పోషకాహారాన్ని విద్యార్థులకు సక్రమంగా అందజేయాలని తెలియజేశారు. ఈ పోషకాహార పదార్థాలు ఎక్కడి నుంచి ఎలా వస్తాయి? అని వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల హాజరు పట్టిని పరిశీలించారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.

రహదారులపై రాకపోకలకు ఆంక్షలు

పిడుగురాళ్ల, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ ప్రభావంతో జాతీయ రహదారులపై మంగళవారం రాత్రి 7 గంటల నుంచి రాకపోకలకు ఆంక్షలు విధించినట్లు పట్టణ సీఐ వెంకట్రావు తెలిపారు. తుఫాన్ ప్రభావం కారణంగా జాతీయ రహదారులపై ప్రయాణించే భారీ వాహనాలను మంగళవారం రాత్రి 7 గంటల నుంచి ఎక్కడికక్కడ నిలిపివేయనున్నట్లు సీఐ తెలిపారు. వాహనదారులు ఈ అసౌకర్యాన్ని గమనించి సహకరించాలని కోరారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

క్రోసూరు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పీసపాడులో ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ మంగళవారం చిన్ని కోటేశ్వరరావు(45) అనే వ్యక్తి మరణించాడు. ఈ నెల 20వ తేదీన దీపావళి పండుగ రోజు గ్రామంలోని కంచేటి త్రివేణి గృహంలో గ్యాస్ సిలిండర్ పేలిన దుర్ఘటనలో గాయపడిన నలుగురిలో చిన్ని కోటేశ్వరరావు కూడా ఉన్నారు. పరిస్థితి ఆందోళనకరంగా ఉన్న కోటేశ్వరరావును చికిత్స నిమిత్తం గుంటూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించి మంగళవారం మరణించినట్టు బంధువులు తెలియజేశారు. కోటేశ్వరరావుకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. వ్యవసాయ కూలీ పనులు, చిరువ్యాపారం చేసుకొని జీవించే కోటేశ్వరరావు మరణంతో ఆ కుటుంబం ఉపాధి కోల్పోయింది. కోటేశ్వరరావు కుటుంబాన్ని ఆదుకోవాలని భార్య, పిల్లలు వేడుకుంటున్నారు.

పాదచారిని ఢీకొన్న లారీ

మాచర్ల, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్న వ్యక్తిని లారీ ఢీకొన్న ఘటన మాచర్ల పట్టణంలో మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. పట్టణంలోని రోప్‌లైన్ కాలనీకి చెందిన ఒట్టిపోగు సాగరబాబు సెంట్రింగ్ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. రింగురోడ్డు సెంటర్లో నడుచుకుంటూ వెళ్తుండగా వెనుకగా వచ్చిన లారీ ఢీకొనడంతో గాయాలపాలయ్యాడు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా ప్రాంతానికి చేరుకొని సాగరబాబును పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. వైద్యులు చికిత్సనందిస్తున్నారు. పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పంటల్లో వర్షపు నీటిని తొలగించండి : ఏడీఏ

మాచవరం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావం వల్ల పంట పొలాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని పిడుగురాళ్ళ ఏడీఏ శ్రీకృష్ణదేవరాయలు రైతులకు సూచించారు. మంగళవారం మండలంలోని కొత్తగణేషునిపాడు, పిల్లుట్ల గ్రామాల్లో పంట పొలాలను పరిశీలించి రైతులకు సూచనలు, సలహాలు తెలియజేశారు. తుఫాన్ వర్షాల వల్ల పంట పొలాల్లో నీరు నిల్వ ఉంటుందని, పంటలు దెబ్బతినకుండా నీటిని తొలగించాలని తెలియజేశారు. ఆయన వెంట ఏవో రామమ్మ, ఆషాబీ, హనుమంత్ నాయక్, రైతులు ఉన్నారు.

పులిచింతల సమాచారం

అచ్చంపేట, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): పులిచింతల ప్రాజెక్టులో మంగళవారం 40.16 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్లు పులిచింతల ప్రాజెక్టు ఏఈ రాజు తెలిపారు. ఎగువ నుంచి 36,300 క్యూసెక్కుల నీరు ప్రాజెక్టుకు చేరుతుంది. ప్రాజెక్టు వద్ద పవర్ జనరేషన్ ద్వారా 16,600 క్యూసెక్కులు, లీకుల ద్వారా నాలుగు వందల క్యూసెక్కులు, రెండు గేట్ల ద్వారా 40,503 క్యూసెక్కులు, మొత్తం 57,503 క్యూసెక్కుల నీరు దిగువ కృష్ణకు విడుదల చేస్తున్నారు.

మూడో రోజు పాఠశాలలకు సెలవు

మాచవరం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావం వల్ల బుధవారం కూడా పాఠశాలలకు సెలవులు ప్రకటించినట్టు ఎంఈవో శ్రీధర్ మంగళవారం తెలిపారు. తుఫాన్ ప్రభావం ఎక్కువగా ఉంటుందనే ముంద స్తు జాగ్రత్తల్లో భాగంగా జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పాఠశాలలకు సెలవులు ప్రకటించారన్నారు.

ప్రజలకు సహాయక చర్యలు చేపట్టాలి

● ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు



పిడుగురాళ్ల, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ కారణంగా నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల్లో ప్రజలకు అసౌకర్యం కలుగకుండా అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు పార్టీ శ్రేణులకు సూచించారు. మంగళవారం నియోజకవర్గంలోని పలువురు పార్టీ కన్వీనర్లు, కూటమి నేతలు, ముఖ్యులు, కార్యకర్తలతో ఎమ్మెల్యే యరపతినేని ఫోన్‌లో మాట్లాడారు. లోతట్టు ప్రాంతాల్లో గానీ, మరెక్కడైనా ప్రజలకు అసౌకర్యంగా ఉన్నట్లు గుర్తిస్తే వెంటనే సహాయక చర్యలు చేపట్టాలని, మురుగు కాల్వలు, డ్రైనేజిలు, కల్వర్టుల వద్ద నీరు పోకుండా అడ్డుగా ఉన్నట్లైతే వాటిని తొలగించేందుకు అధికార యంత్రాంగం కూడా సిద్ధంగా ఉండాలని మున్సిపల్, పంచాయతీరాజ్, రెవెన్యూ అధికారులకు ఎమ్మెల్యే సూచించారు. పట్టణ ప్రాంతంలోని యరపతినేనినగర్, రిక్షాకాలనీ, పిల్లలగడ్డ, జంగాల కాలనీ, సుందరయ్య కాలనీ, పాటిగుంతల ప్రాంతాల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే యరపతినేని కూటమి నేతలకు, అధికారులకు సూచించారు. వ్యవసాయ, ఉద్యానశాఖ అధికారులు జాగ్రత్తలు తీసుకునేలా రైతులకు అవగాహన కల్పించాలని మాట్లాడారు.



నరసరావుపేట రోడ్డులో పర్యటించిన ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ

తుఫాన్‌పై అధికారులు అప్రమత్తంగా ఉండాలి

● ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ

సత్తెనపల్లి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): తుఫాన్‌పై అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. మంగళవారం పట్టణంలోని నరసరావుపేట రోడ్డులో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తుఫాన్ వల్ల ఆస్తి నష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు సన్నద్ధంగా ఉండాలన్నారు. పునరావాస శిబిరాల సమాచారం ఎప్పటికప్పుడు ప్రజలకు తెలియజేయాలన్నారు. విద్యుత్‌కు అంతరాయం లేకుండా, నీటి సరఫరాకు ఇబ్బంది లేకుండా ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలని అధికారులు సూచించారు. లోతట్టు ప్రాంతాల్లో ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలన్నారు. ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండాలన్నారు. అత్యవసరమైతే తప్పితే బయటకు రాకూడదన్నారు. నరసరావుపేట రోడ్డులోని కల్వర్టులను మాచర్ల రోడ్డులో జరుగుతున్న కల్వర్టు పూడిక తీత పనులను స్థానిక నేతలతో కలసి ఆయన పరిశీలించారు.

సిబ్బందిని అప్రమత్తం చేస్తున్నాం

తహసీల్దార్ శ్రీనివాస్‌యాదవ్



తుఫాన్‌పై సిబ్బందికి సూచనలు ఇస్తున్న తహసీల్దార్ శ్రీనివాస్‌యాదవ్, సీఐ భాస్కరరావు

దాచేపల్లి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్‌తో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై దాచేపల్లి తహసీల్దార్ శ్రీనివాస్‌యాదవ్, దాచేపల్లి సీఐ భాస్కరరావు, ఎంపీడీవో వెంకటేశ్వరరావుతో కలసి గ్రామాల్లోని సచివాలయ సిబ్బందికి, ఇతర ప్రభుత్వ సిబ్బందిని అలర్ట్ చేస్తున్నారు. గ్రామాల్లో ప్రజలెవ్వరూ విద్యుత్ స్తంభాల వద్దకు గానీ, వర్షాలు పడుతున్న సమయాల్లో పంట పొలాల్లో సంచరించటం గానీ, వాగులు, వంకలు పొంగి ప్రవహిస్తున్నప్పుడు దాటే ప్రయత్నం చేయరాదని హెచ్చరించారు. సిబ్బందికి సెలవులు రద్దు చేశారని, ఎవ్వరూ కూడా తమ స్థానాలను వదిలి బయటకు వెళ్లకూడదని చెప్పారు. విద్యుత్ తీగలు తెగిపడినా, విద్యుత్ స్తంభాలు ఒరిగిపోయినా స్థానిక వీఆర్వో, వీఆర్ఏ, పంచాయతీ కార్యదర్శి, సచివాలయ పోలీసు సిబ్బందికి, మండలస్థాయి అధికారులకు సమాచారం ఇవ్వాలని సూచనలు చేశారు. మండలంలో ఇప్పటివరకు 12మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్టు అధికారులు వివరించారు.

బాధితులకు టీడీపీ శ్రేణులు సహాయం అందించాలి



అధికారులకు సమస్యలు వివరిస్తున్న మొగల్‌జాన్

క్రోసూరు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ బాధితులకు ఎప్పుడు ఏ సహాయం కావాలన్నా టీడీపీ శ్రేణులు అందించేందుకు సిద్ధంగా ఉండాలని మండల అధ్యక్షుడు మొగల్‌జాన్ పిలుపునిచ్చారు. మంగళవారం అధికారులతో కలసి ఆయన గ్రామాల్లో పర్యటించి అధికారుల దృష్టికి కొన్ని సమస్యలు తీసుకువచ్చారు. తహసీల్దార్ నాగరాజు, ఎంపీడీవో రవికుమార్ మాట్లాడుతూ ప్రతి గ్రామంలోను గ్రామ కార్యదర్శిని, వీఆర్వోను, విద్యుత్ సిబ్బందిని, వాటర్ సిబ్బందిని, పోలీసు సిబ్బందిని అందుబాటులో ఉంచినట్టు తెలిపారు. ఎటువంటి సమస్యలు ఎదురైనా 8179738216కు ఫోన్ చేయాలని తెలియజేశారు.

పంటలకు నష్టం వాటిల్లకుండా జాగ్రత్తలు పాటించాలి

● వ్యవసాయ, ఉద్యానశాఖ అధికారులు

పిడుగురాళ్ల, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ ప్రభావంతో పంటలకు నష్టం వాటిల్లకుండా పలు జాగ్రత్తలు పాటించాలని వ్యవసాయ అధికారి సంధ్యారాణి తెలిపారు. మంగళవారం వీరాపురంలో వరి పంటలను పరిశీలించి రైతు సేవాకేంద్రాల్లో గ్రామస్థులు, రైతులతో మాట్లాడారు. వర్షప్రభావం పూర్తిగా తగ్గే వరకు వరి కోతలు ప్రారంభించవద్దని, పొలంలో ఉన్న వర్షపునీటిని కాల్వలు తీసి నీటిని బయటకు పంపే ఏర్పాట్లు చేసుకోవాలని వ్యవసాయ అధికారి సంధ్యారాణి రైతులకు సూచించారు. అదేవిధంగా జూలకల్లులో ఉద్యానశాఖ అధికారి అంజలి మిర్చి పంటను పరిశీలించారు. వర్షపునీటిని మిరప సాళ్లలో నిల్వ ఉండకుండా ఎప్పటికప్పుడు బయటకు పంపించే ఏర్పాట్లు చేసుకోవాలని, ఉరకెత్తిన మిర్చి పొలంలో వ్యవసాయ అధికారుల సూచనలతో మందులు పిచికారి చేయాలని రైతులకు సూచించారు. మరో మూడు రోజుల పాటు వర్ష ప్రభావం ఉన్నందున పంటలను క్షుణ్ణంగా పరిశీలించారని రైతులకు సూచించారు. అదేవిధంగా పలు గ్రామాల్లో గ్రామ వ్యవసాయ అధికారులు రైతులు సాగుచేస్తున్న వరి, మిర్చి పంటలను పరిశీలించారు.

రైతులకు అవగాహన సదస్సులు

రాజుపాలెం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రెడ్డిగూడెం, ముక్కపాడు గ్రామాల్లోని రైతులకు మండల వ్యవసాయశాఖ అధికారి వెంకట నరసయ్య అధిక వర్షాలతో పత్తి, వరి పంటల్లో చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వెంకట నరసయ్య మాట్లాడుతూ పత్తి పైరులో నిలిచిన నీటిని తొలగించి ఎకరానికి 25-30 కిలోల యూరియా, 10-15 కిలోల పొటాష్ అదనంగా వేయాలని చెప్పారు. వాతావరణం అనుకూలించిన వెంటనే పలుమార్లు అంతర కృషి చేయాలన్నారు. వరి పంట అక్కడక్కడ పడిపోయిన చోట వరిని నిలబెట్టి కట్టాలని చెప్పారు. పొలంలోని నీటిని తొలగించాలన్నారు. నీటిని తొలగించిన తరువాత ప్రొపికొనజోల్‌ను ఎకరానికి 200 మిల్లీమీటర్లు పిచికారి చేసినచో గింజ రంగు మారకుండా, పొడ తెగులు మానిపండు తెగులు రాకుండా నివారించవచ్చునని తెలిపారు. ఈ కార్యక్రమంలో వీఏఏలు ఉమామహేశ్వరరెడ్డి, హేమంత్ తదితరులు ఉన్నారు.

ఖననం చేసిన మృతదేహం వెలికితీత

నరసరావుపేట లీగల్, అక్టోబరు 28, (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ వద్ద అనారోగ్యంతో మృతిచెందిన గుర్తుతెలియని వ్యక్తి శవాన్ని ఆయన కుటుంబ సభ్యులు గుర్తించటంతో, ఖననం చేసిన మృతదేహాన్ని వెలికితీసిన ఘటన మంగళవారం చోటుచేసుకుంది. మొదటి పట్టణ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం రొంపిచర్ల మండలం ముత్తనపల్లి గ్రామానికి చెందిన కొరటి నరేష్ (25)కు ఇటీవల బొల్లాపల్లి మండలం పేర్ల పాడుకు చెందిన యువతితో వివాహమైంది. నరేష్ దుర్వ్యసనాలతో పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్, రైల్వేస్టేషన్ వద్దనే జీవిస్తూ అనారోగ్యంతో సోమవారం మృతి చెందాడు. గుర్తు తెలియని వ్యక్తిగా భావించిన మొదటి పట్టణ పోలీసులు శవాన్ని ఖననం చేశారు. అయితే అనంతరం మీడియాలో ఫొటోలు చూసి మృతుని కుటుంబ సభ్యులు మొదటి పట్టణ పోలీసులను ఆశ్రయించారు. దీంతో మొదటి పట్టణ పోలీసులు రెవెన్యూ అధికారులు ఎదుట మృతుని శవాన్ని వెలికితీసి శవ పరీక్ష నిర్వహించి, మృతదేహాన్ని ఆయన కుటుంబ సభ్యులకు అప్పగించారు.

పోలీసుల అదుపులో దారిదోపిడీ ముఠా

రొంపిచర్ల, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వడ్లమూడివారిపాలెం నుంచి నరసరావుపేట వెళ్లే రహదారిలో సోమవారం రాత్రి దారి దోపిడీ జరిగింది. విప్పర్ల గ్రామానికి చెందిన ఓ వ్యక్తిని అడ్డగించి రూ.2 వేలు నగదును దుండగులు దోచుకున్నారు. కొద్ది రోజుల క్రితం వడ్లమూడివారిపాలెం నుంచి రొంపిచర్ల వెళ్లే రహదారిలో, సంతగుడిపాడు సమీపంలో కూడా ఇటువంటి ఘటనలే చోటు చేసుకున్నట్లు సమాచారం. అయితే ఈ దారిదోపిడీ ఘటనలకు సంబంధించి రొంపిచర్ల పోలీసులు నలుగురిని మంగళవారం అదుపులోకి తీసుకున్నట్టు సమాచారం. వీరు నరసరావుపేట, క్రోసూరు, అచ్చంపేట గ్రామాలకు చెందినవారని తెలుస్తోంది. ఇంకా కొంత మందిని అదుపులోకి తీసుకోవాల్సి ఉంది. వారి నుంచి పోలీసులు వివరాలు సేకరిస్తున్నారు. దోపిడీలో సొమ్ము పోగొట్టుకున్న వారు స్టేషన్‌కు వచ్చి వివరాలను పోలీసులకు ఇచ్చారు.

లారీని ఢీకొన్న ఆటో

నరసరావుపేట రూరల్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): చిలకలూరిపేట - నరసరావుపేట ప్రధాన రహదారిపై ఆగి ఉన్న లారీని ఆటో ఢీకొన్న సంఘటన మంగళవారం తెల్లవారుజామున జరిగింది. తెలంగాణ రాష్ట్రానికి చెందిన లారీ నరసరావుపేట మండలం బసికాపురం వద్ద రోడ్డు మార్జిన్‌లో నిలిపిన లారీని నరసరావుపేట నుంచి చిలకలూరిపేట వెళ్తున్న ఆటో ఎదురుగా ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆటో, లారీ దెబ్బతిన్నాయి.

కుప్పగంజి వాగు వద్ద లారీ బోల్తా

చిలకలూరిపేట, అక్టోబరు28 (ఆంధ్రజ్యోతి): నరసరావుపేట చిలకలూరిపేట మార్గంలో లింగంగుంట్ల సమీపంలో కుప్పగంజి వాగు వంతెన సైడ్ గోడను ఢీకొని పాత గోతాల లోడుతో ఉన్న ఒక లారీ బోల్తా పడింది. ప్రమాదంలో వంతెన గోడ సుమారు 20మీటర్ల మేరకు దెబ్బతిన్నట్లు అధికారులు అంచనావేశారు. లారీ నష్టం జరిగింది. లారీ డ్రైవర్ కునుకు తీయడంతో ప్రమాదం జరిగిందంటున్నారు. లారీ డ్రైవర్ క్షేమంగా బయటపడ్డాడు. సమాచారం అందుకున్న వెంటనే చిలకలూరిపేట రూరల్ ఎస్ఐ జి.అనిల్ కుమార్ ప్రమాద స్థలానికి చేరుకొని లారీని పక్కకు తొలగించి నిలిచిపోయిన రాకపోకలను పునరుద్ధరించారు.

సదరం రీ అసెస్మెంట్ క్యాంపు రద్దు

నరసరావుపేట రూరల్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ కారణంగా పల్నాడు జిల్లాలో జరుగుతున్న 29 నుంచి 31 వరకు జరగనున్న సదరం రీ అసెస్మెంట్ క్యాంప్‌లు ఈ వారం రద్దుచేసినట్లు ప్రాజెక్టు డైరెక్టర్ ఝాన్సీరాణి తెలిపారు. తేదీలను మరలా ప్రకటిస్తామన్నారు.

వెంకటేశ్వరస్వామి కల్యాణం వాయిదా

వినుకొండ, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): శ్రీనివాసనగర్‌లోని అలివేలుమంగ పద్మావతి సమేత వెంకటేశ్వరస్వామి దేవాలయంలో ఈ నెల 30వ తేదీన జరగనున్న స్వామివారి కల్యాణోత్సవం తుఫాను కారణంగా వాయిదా వేస్తున్నట్లు దేవస్థాన కమిటీ అధ్యక్షుడు రెడ్డి బంగారయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

'ఆరోగ్యశ్రీ బకాయిలను చెల్లించాలి'

వినుకొండ టౌన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ఎన్‌టీఆర్ ఆరోగ్యశ్రీ ద్వారా గత 14 రోజులుగా ప్రైవేటు ఆసుపత్రుల్లో వైద్యసేవలు నిలిచిపోవడంపై జిల్లా సీపీఐ ప్రధాన కార్యదర్శి మారుతివరప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో పేద ప్రజలకు సరైన వైద్యం అందక వేలకువేలు డబ్బులు కట్టి వైద్యం చేయించుకోలేక అల్లాడిపోతున్నారని, ఎన్‌టీఆర్ ఆరోగ్యశ్రీ ద్వారా అనుసంధానమైన హాస్పటల్స్‌కు వెంటనే ప్రభుత్వం రూ.3వేల కోట్లకు పైగా ఉన్న బకాయిలను చెల్లించాలని డిమాండ్ చేశారు.

ప్రతి శ్రామికుడు ఈ కేవైసీ చేయించుకోవాలి: ఏపీవో పుష్పరాజ్

ఈపూరు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం జాబు కార్డులు కలిగిన ప్రతి శ్రామికులు ఈకేవైసీ చేయించుకోవాలని ఏపీవో పుష్పరాజ్ అన్నారు. ఈ నెలాఖరు లోపు మిగతావారు కూడా ఈ కేవైసీ చేయించుకోవాలని ఏపీవో కోరారు. ఈ కేవైసీ నూరు శాతం పూర్తిచేసిన గోపురిపాలెం పంచాయతీ ఫీల్డ్ అసిస్టెంట్ గోపి వీరాంజనేయులు పిడి సిద్ధ లింగమూర్తి, ఏపీడీఈ వూరి బూసిరెడ్డి అభినందించారు.

విద్యార్థులకు రోటరీ క్లబ్ చేయూత

బొల్లాపల్లి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): రోటరీ క్లబ్ ఆఫ్ గ్రేటర్ వినుకొండ వారి ఆధ్వర్యంలో మండల కేంద్రం బొల్లాపల్లి జడ్పీ హైస్కూల్ విద్యార్థులకు రోటరీ క్లబ్ ఆఫ్ గ్రేటర్ వినుకొండకు చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు నాగేంద్రుడు సహకారంతో ఆట వస్తువులను అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం శ్రీనివాసరావు, రోటరీ ముఖ్యులు ఎ.శ్రీనివాసరావు, ఎం.గిరిబాబు, కె.రామాంజనేయులు, ఉపాధ్యాయులు, గ్రామస్థులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట

తుఫాన్ బాధితుల రక్షణే ప్రభుత్వం లక్ష్యం

● చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు



వినుకొండ, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో నెలకొన్న తీవ్ర తుపాను పరిస్థితుల దృష్ట్యా ప్రభుత్వం ప్రజల రక్షణకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ ప్రభుత్వం పటిష్ఠమైన చర్యలు చేపట్టిందని ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు తెలిపారు. ఆయన మాట్లాడుతూ ప్రజలకు ప్రాణ, ఆస్తినష్టం వాటిల్లకుండా తగిన చర్యలు చేపట్టినట్లు తెలిపారు. మొంథా తుపాను హెచ్చరికలు రాగానే ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రభుత్వ యంత్రాంగాన్ని అప్రమత్తం చేసి మంత్రులు, ఎమ్మెల్యేలు ప్రజాప్రతినిధులందరూ ప్రజలకు అండగా నిలవాలని పిలుపునిచ్చారు. సీఎం ఆదేశాలతో ప్రజాప్రతినిధులంతా బాధితులకు అండగా నిలబడి సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్నామన్నారు. మొంథా తుపాన్‌ను ఎదుర్కొనేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తున్నారని పేర్కొన్నారు. తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో ఒక్క ప్రాణ నష్టం కూడా ఉండకూడదనే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందని, దీనిలో భాగంగా నూతన అప్రమత్తత వ్యవస్థను అమలులోకి తెచ్చిందన్నారు. రాష్ట్రస్థాయిలో అందుబాటులో ఉన్న సమాచారం ఆధారంగా, అమరావతిలోని ఆర్టీజీఎస్ సెంటర్ నుంచి నేరుగా రాష్ట్రంలో తుఫాన్ వల్ల ప్రభావితమయ్యే వివిధ తీర ప్రాంత గ్రామాలకు మైకుల ద్వారా ప్రజలను అప్రమత్తం చేశారన్నారు. ప్రజల్ని అప్రమత్తం చేసేందుకు మైక్ ప్రచారం,, ఐవీఆర్ఎస్, సోషల్ మీడియా, మీడియా వంటి ప్రతిమాధ్యమాన్ని వినియోగిస్తూ, ఎప్పటికప్పుడు తుఫాన్ పరిస్థితిని ప్రజలకు వివరిస్తోందన్నారు. అధికారులు చెబుతున్న సూచనలు పాటిస్తూ ప్రజలు అప్రమత్తంగా, సురక్షితంగా ఉండాలన్నారు. పంటనష్టాల గురించి రైతులెవ్వరూ భయపడాల్సిన, ఆందోళన పడాల్సిన అవసరం లేదన్నారు. ప్రభుత్వం ఎప్పటికప్పుడు పరిస్థితిని పర్యవేక్షిస్తుందని, నష్టపోయిన ప్రతి రైతునూ ఆదుకుంటుందని భరోసానిచ్చారు. వినుకొండ నియోజకవర్గంలో ఎలాంటి సమస్య తలెత్తినా స్థానిక అధికారులు, ప్రజాప్రతినిధులతో పాటు వినుకొండలోని తన కార్యాలయానికి సమాచారం అందించాలని జీవీ కోరారు. కూటమి నాయకులు, కార్యకర్తలంతా సహాయక చర్యల్లో పాల్గొనాలనాలని కోరారు.

వర్షంతో పొలాల్లో నిలిచిన నీరు



ఈపూరు మండలంలో మిరప తోటలో నిలిచిన నీరు

ఈపూరు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావంతో కురుస్తున్న గాలివానకు వరి, మిరప పైర్లు దెబ్బతిన్నాయి. తీవ్రంగా ఇస్తున్న గాలికి వరి పంట నేలవాలింది. మిరప పొలాల్లో నీరు నిలిచాయి. మండలంలోని కొచ్చర్ల, శ్రీనగర్, కొత్త నెల్లూరు గ్రామాల్లో కేఎస్ఎం 1638 రకం వంగడం సాగు చేశారు. ప్రస్తుతం వరి కంకి దశలో ఉంది. కురుస్తున్న వర్షాలకు వరి పైరు నేలమట్టం అయింది. సుమారు 400ఎకరాల్లో కేఎస్ఎం వరి వంగడం సాగు చేయగా దాదాపు 100 ఎకరాల్లో వరి పైరు నేలవాలిందని రైతులు చెబుతున్నారు. అదేవిధంగా మిరప కూడా పూత దశలో ఉంది. తీవ్ర గాలి వానకు పూత రాలటమే కాకుండా కొమ్మలు కూడా విరిగాయి. మిరప పొలంలో నీరు నిల్వ ఉండిపోయింది. పొట్ట దశలో ఉన్న వరిపైరుకు నష్టం వాటిల్లుతుందని రైతలు ఆందోళన చెందుతున్నారు.

● బొల్లాపల్లి: బొల్లాపల్లి మండలంలోని పేరూరు పాడులో చేతికి అంది వచ్చిన వరి పంట ఈదురు గాలులకు నేలకొరిగింది. పలువురు రైతులు వ్యవసాయ అధికారులకు తెలియజేయగా తక్షణమే స్పందించిన వ్యవసాయ అధికారులు నేలకు వాలిన వరి పంటలను పరిశీలించి తగు సూచనలు చేశారు.

ఎడ తెరిపి లేకుండా వర్షం

రొంపిచర్ల, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గ్రామాల్లో మంగళవారం ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. దీంతో జనసంచారం నిలిచి పోయింది. రహదారులపై రాకపోకలు పెద్దగా లేవు. ప్రయాణాలు కూడా ప్రజల వాయిదా వేసుకున్నారు. మొక్క జొన్న పంటను సాగు చేద్దామనుకున్న రైతులు వర్షాల కారణంగా విత్తనాలు నాటే కార్యక్రమాన్ని వాయిదా వేసుకున్నారు.

నేలకొరిగిన భారీ వృక్షాలు

నరసరావుపేట రూరల్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ నేపధ్యంలో ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. మంగళవారం మధ్యాహ్నం నుంచి కురుస్తున్న భారీ వర్షాలకు నరసరావుపేట - పిడుగురాళ్ళ ప్రధాన రహదారిపై నరసరావుపేట మండలం రావిపాడు గ్రామం వద్ద రోడ్డుపక్కన ఉన్న భారీ చింతచెటు విరిగి రోడ్లపై పడ్డాయి. దీంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. సమాచారం అందుకున్న నరసరావుపేట రూరల్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పొక్లెయిన్ సాయంతో విరిగిన చెట్లను తొలగించి ట్రాఫిక్ క్లియర్ చేశారు.

మొంథా తుఫాన్‌పై అధికారుల సమీక్ష

● ప్రమాదకర ప్రాంతాల్లో పర్యటన
● సహాయ చర్యల పర్యవేక్షణ



కమ్మవారిపాలెం ఎస్టీ కాలనీ వద్ద ఎస్కవేటరుతో రోడ్డుకు పైపులు వేస్తున్న అధికారులు

వినుకొండ, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): వినుకొండలో మొంథా తుఫాన్ కారణంగా గ్రామాల్లో ఎటువంటి ప్రమాదాలు జరగకుండా అధికారులు తగిన చర్యలు చేపట్టారు. ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు, ఓహెచ్‌డీ వరదా సుబ్బారావు, జిల్లా డ్వామా పీడీ, వినుకొండ నియోజకవర్గ ప్రత్యేక అధికారి లింగమూర్తిలు ఎప్పటికప్పుడు మండలాల్లో వాతావరణ పరిస్థితులను తెలుసుకుంటూ ప్రమాదకర ప్రాంతాలైన చెరువులు, వాగులను పరిశీలించారు. ఇదిలా ఉండగా సుదూర ప్రాంతాలకు వెళ్లే ప్రజలను ఆర్టీసీ అధికారుల సాయంతో ఎప్పటికప్పుడు బస్సు ద్వారా స్వగ్రామాలకు పంపిస్తున్నారు. ఎక్కడికక్కడికి పునరావాస కేంద్రాలను ఏర్పాటుచేసి గ్రామాల్లో ప్రమాదకరప్రాంతాల్లో నివాసం ఉంటున్న వారిని పునరావాస కేంద్రాలకు తరలించేందుకు అధికారులు సర్వం సిద్ధం చేస్తున్నారు. వినుకొండ నియోజకవర్గంలోని మల్లెడవాగును వినుకొండ తహసీల్దార్ సురేష్ సిబ్బంది సాయంతో పరిశీలించారు. అదేవిధంగా విలేజీ నౌకర్ల ద్వారా గ్రామాల్లో చాటింపు వేయించి పురాతన భవనాలు, పూరిగుడిసెల్లో నివాసం ఉంటున్న ప్రజలను అప్రమత్తం చేశారు. ఎప్పటికప్పుడు సమాచారం తెప్పించుకొని ప్రమాదకర ప్రాంతాల్లో పర్యటిస్తూ తగిన చర్యలు చేపట్టారు.

● నాదెండ్ల: మొంథా తుఫాన్‌పై అధికారులు, వీఆర్‌వోలు, గ్రామ కార్యదర్శులు పర్యవేక్షణ చేస్తున్నారు. తహసీల్దార్ కుటుంబరావు, డిప్యూటీ తహసీల్దార్ సల్మాన్, ఎంపీడీవో స్వరూపరాణిలు ఆయా గ్రామాల్లో పరిస్థితులపై ఆరా తీశారు. ఆయా గ్రామాల్లో ఇబ్బందులు ఏమైనా ఉంటే గ్రామాల్లోని వీఆర్‌వోలు, పంచాయతీ కార్యదర్శుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. ప్రతి గ్రామంలోను పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేశారు. గణపవరం గ్రామ పరిధిలోని కుప్పగంజి వాగు సమీపంలో నివాసం ఉంటున్న వారితో డిప్యూటీ ఎంపీడీవో వెంకటేశ్వరరావు, కార్యదర్శి మారుతీబాబులు మాట్లాడారు. ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రానికి రావాలని సూచించారు.

● నూజెండ్ల: మండలంలోని కమ్మవారిపాలెం ఎస్టీ కాలనీ వద్ద తుపాను ప్రభావంతో కురుస్తున్న భారీ వర్షాలకు నీరు నిలబడటంతో ఎంపీడీవో పీ ఉమాదేవి మంగళవారం ఎస్కవేటర్‌తో ఆర్‌అండ్‌బీ రోడ్డుకు పైపులు వేసి నీరు నిలబడకుండా సహాయక చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా ఉమాదేవి మాట్లాడుతూ భారీవర్షాల దృష్ట్యా ప్రజలకు సహాయక చర్యలు అందించేందుకు ఎంపీడీవో, తహసీల్దార్ కార్యాలయాలు, సచివాలయాల్లో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటుచేసి ప్రభుత్వ అధికారులు, సిబ్బంది పర్యవేక్షిస్తున్నారన్నారు.

● బొల్లాపల్లి: మండలంలోని మూగచింతల పాలెంలోని చెరువును మంగళవారం జిల్లా అధికారులు, డ్వామా పీడీ సిద్ద లింగమూర్తి తహసీల్దార్ ఏ సుధాకర్, ఎంపీడీవో పీ మాధురి, ఇరిగేషన్ డిపార్ట్‌మెంట్ డైరెక్టర్ పెమ్మసాని నాగేశ్వరరావు పరిశీలించారు. మొంథా తుఫాన్ కారణంగా రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో మూగచింతలపాలెం చెరువు ప్రమాదకరకరంగా ఉందన్న సమాచారంతో పరిశీలించారు. గతంలో ఈ చెరువుకు గండి పడటంతో సంవత్సరం క్రితం తాత్కాలికంగా కొన్ని మరమ్మతులు చేశారు. సోమవారం రాత్రి నుంచి కురుస్తున్న భారీ వర్షానికి చెరువు కట్టకు గండిపడే ప్రమాదం ఏర్పడింది. దీంతో గ్రామస్థులు దీనిని కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్ళారు. దీంతో కలెక్టర్ ఆదేశాలతో జిల్లా అధికార యంత్రాంగం చెరువు కట్ట దగ్గరకు చేరుకొని కోతకు గురి కాకుండా చెరువులో నీటిని చిన్న గండి ద్వారా పక్కకు మరల్చారు. కార్యక్రమంలో ఉపాధి హామీ సిబ్బంది, ఏపీవో లక్ష్మణ్, గ్రామస్థులు పాల్గొన్నారు.



బలహీనంగా ఉన్న కట్టను పరిశీలిస్తున్న తహసీల్దార్ సుధాకర్, డ్వామా పీడీ సిద్ధ లింగమూర్తి

● శావల్యాపురం: మొంథా తుఫాన్‌తో ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీవో పేరుమీన సీతారామయ్య పిలుపునిచ్చారు. శావల్యాపురంలోని తాగునీటి చెరువును ఇన్‌చార్జి డిప్యూటీ ఎంపీడీవో బొడ్డు యాకోబుతో కలసి మంగళవారం ఆయన పరిశీలించారు. ఎంపీడీవో మాట్లాడుతూ మండలంలోని 11 గ్రామసచివాలయాల్లో ఉద్యోగులు ప్రజలకు అందుబాటులో ఉండి సహాయక చర్యలు అందిస్తారన్నారు. పిచికలపాలెంలో ఇన్‌చార్జి సర్పంచ్ గణపర్తి ఆంజనేయులు ఎస్సీ, ఎస్టీ, బీసీ కాలనీలను సందర్శించి సహాయక చర్యలు అందించారు.

● చిలకలూరిపేట: మొంథా తుఫాన్ కారణంగా మంగళవారం పగలంతా తేలికపాటి గాలులతో కూడిన స్వల్ప వర్షం పడింది. అయితే సాయంత్రం నుంచి గాలుల తీవ్రతతో పాటు వర్షం పెరిగింది. కొన్ని ప్రాంతాలలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. పట్టణంలోని సుగాలి కాలనీ, ఆర్‌వీఎస్‌సీవీఎస్ హైస్కూలు, పెదనందిపాడు రోడ్డులోని కాకతీయ స్కూలులలో పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ కేంద్రాల వద్ద జనరేటర్లను కూడా సిద్ధం చేసి ఉంచారు. మున్సిపల్ కమిషనర్ పి.శ్రీహరిబాబు ఆధ్వర్యంలో జేసీబీలు, జనరేటర్లు, జీపులు, ప్రత్యేక బృందాలు, రంపాలు, టార్చ్‌లైట్‌లు, రైయిన్ కోట్లతో రాత్రి పరిస్థితిని ఎదుర్కోవడానికి సిబ్బందిని ఏర్పాటు చేశారు. శాంతినగర్, పెదనందిపాడు రోడ్డు, శారద హైస్కూల్ రోడ్డు, జాతీయ రహదారి పక్కన ఉన్న ప్రధాన మురుగు కాలువలలో జేసీబీలతో కాలువలలో ఉన్న వ్యర్థాలను, పూడికను తొలగించారు. మునిసిపల్ చైర్మన్ షేక్ రఫాని, కౌన్సిలర్ జాలాది సుబ్బారావు లోతట్టు ప్రాంతాలను సందర్శించారు. అక్కడి వారికి ఆహారపు పొట్లాలు పంపిణీ చేశారు. వాగుల వద్ద పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేశారు.

పునరావాస కేంద్రాలకు పలువురి తరలింపు


నాదెండ్ల, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): తుఫాను ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని రెండు గ్రామాలలో పలు కుటుంబాలను పునరావాస కేంద్రాలకు తరలించారు. ఎండుగుంపాలెం గ్రామ పరిధిలోగల తుర్లపాడు మేజరు కాలువ కట్టపై గుడారాలలో నివాసం ఉంటున్న వలస కూలీలకు చెందిన 20కుటుంబాలను జడ్పీ హైస్కూల్‌లో ఏర్పాటుచేసిన పునరావాస కేంద్రానికి పంచాయితీ కార్యదర్శి .అహ్మద్, ఎస్ఐ పుల్లారావు, గట్టినేని రమేష్‌ల ఆధ్వర్యంలో తరలించారు. అదే విధంగా అవిశాయిపాలెం సమీపంలోగల కేంద్రీయ విద్యాలయం పక్కన ఉంటున్న 8 కుటుంబాల వారితో తహసీల్దార్ కుటుంబరావు మాట్లాడి జడ్పీ హైస్కూల్‌లోని పునరావాస కేంద్రానికి తరలించారు.



చిలకలూరిపేట: మురుగు కాలువలో పూడికను తొలగిస్తున్న ఎక్స్‌కవేటర్

రైతులు ఆందోళన చెందవద్దు

జిల్లా వ్యవసాయ అధికారి జగ్గారావు



నరసరావుపేట మండలం ఉప్పలపాడులో ఉద్యాన పంటలు పరిశీలిస్తున్న అధికారులు

నాదెండ్ల, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్‌పై రైతులు పడే ఇబ్బందులు, రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి జిల్లా వ్యవసాయ అధికారి ఎం.జగ్గారావు రైతులకు పలు సూచనలు చేశారు. మంగళవారం మండల కేంద్రమైన నాదెండ్ల గ్రామంలోని రైతులతో సమావేశమయ్యారు. గడిచిన రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలు పత్తి, ఇతర వాణిజ్య పంటలకు జరిగే నష్టంపై రైతులతో చర్చించారు. వ్యవసాయ శాఖ అధికారులు మండల హెడ్ క్వార్టర్‌లో అందుబాటులో ఉండాలని సూచించారు. ఆయనతో పాటు ఏవో శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

● యడ్లపాడు: మండల కేంద్రమైన యడ్లపాడులో మంగళవారం జిల్లా వ్యవసాయ అధికారి ఎం.జగ్గారావు పర్యటించి ఎన్టీఆర్ స్టేజి సెంటర్‌లో రైతులతో సమావేశమై ప్రస్తుత పంటల పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. పొలాల్లో నిల్వ ఉన్న నీటిని తక్షణమే బయటకు పంపించాలని, నీరు నిలబడకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. మండల, గ్రామస్థాయి వ్యవసాయ అధికారులు రైతులకు అందుబాటులో ఉండాలని జగ్గారావు ఆదేశాలు జారీచేశారు. మండల వ్యవసాయాధికారి హరిప్రసాద్ మాట్లాడుతూ పంట నష్టం సంభవిస్తే వెంటనే సంబంధిత గ్రామ వ్యవసాయ సహాయకులను సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో ఏఈవో జీవన్, వ్యవసాయ సహాయకులు అనుపమ, బిలాల్, రైతులు పాల్గొన్నారు.

ఉద్యాన శాఖ అధికారుల పరిశీలన

నరసరావుపేట రూరల్: మండలంలోని ఉప్పలపాడు, పెట్లూరివారిపాలెం గ్రామాల పరిధిలో, చిలకలూరిపేట మండలం గోవిందాపురం, కావూరు గ్రామాలలో రైతులు సాగులో ఉన్న ఉద్యాన పంటలను జిల్లా ఉద్యానవన శాఖ అధికారి వెంకట్రావు పరిశీలించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో డాక్టర్ జి.క్రాంతి రేఖ, డాక్టర్ బి.నాగేంద్రరెడ్డి పంటలను పరిశీలించి తీసుకోవలసిన జాగ్రత్తలను రైతులకు వివరించారు.

డ్వాక్రా మహిళలకు స్త్రీనిధి రుణ పరిమితి పెంపు: ఇన్‌చార్జి ఏపీఎం రామారావు

శావల్యాపురం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): డ్వాక్రా సంఘాల మహిళలకు స్త్రీనిధి రుణాల పరిమితిని పెంచుతూ ప్రభుత్వం కొత్తగా ఉత్తర్వులు జారీ చేసినట్లు ఇన్‌చార్జి ఏపీఎం అబ్బూరి రామారావు తెలిపారు. స్థానిక వెలుగు కార్యాలయంలో మంగళవారం ఆయన మాట్లాడుతూ స్త్రీనిధి పథకం ద్వారా గతంలో ఒక్కో డ్వాక్రా గ్రూపులో ఐదుగురు మహిళలకు ఒక్కొక్కరికీ రూ.లక్ష చొప్పున రూ.5లక్షల వరకు రుణాలు ఇచ్చేవారని, ప్రభుత్వం దాన్ని సవరిస్తూ ఇప్పుడు ఒక్కో డ్వాక్రా గ్రూపులో ఎనిమిదిమంది మహిళలకు ఒక్కొక్కరికీ రూ.లక్ష చొప్పున రూ.8లక్షల వరకు రుణాన్ని అందిస్తున్నట్లు తెలిపారు. అలానే డ్వాక్రా సంఘాల్లోని పేద కుటుంబాలను ఆదుకునేందుకు ఉన్నత చదువుల కోసం ఎన్టీఆర్ విద్యాలక్ష్మి, ఆడబిడ్డల వివాహఖర్చులకు ఎన్టీఆర్ కల్యాణలక్ష్మి పథకాలను త్వరలో ప్రభుత్వం అమలు చేయనుందన్నారు. ఈ పథకాలతో మహిళలకు 40పైసలు వడ్డీపై రూ.లక్ష వరకు రుణాలు అందజేయనుందన్నారు. సీసీలు కరుణమ్మ, మేరీ పాల్గొన్నారు.



చిలకలూరిపేట పునరావాస కేంద్రంలో తుఫాన్ బాధితులకు ఆహారం అందజేస్తున్న ప్రత్తిపాటి పుల్లారావు

పునరావాస కేంద్రాలను సందర్శించిన ప్రత్తిపాటి

చిలకలూరిపేట, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని తుఫాను ప్రభావిత ప్రాంతాలలో ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు మంగళవారం పర్యటించారు. జాగుపాలెం, కొండ్రుపాడు, సుగాలీ కాలనీలలో ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించే ఏర్పాట్లు చేశారు. పునరావాస కేంద్రాలను సందర్శించి బాధితులను పరామర్శించి భోజనాన్ని వడ్డించారు. ప్రత్తిపాటి వెంట జనసేన ఇంచార్జి తోట రాజారమేష్, మార్కెట్ యార్డ్ చైర్మన్ షేక్ కరీముల్లా, మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని, పట్టణ టీడీపీ అధ్యక్షుడు పఠాన్ సమద్‌ఖాన్, ప్రధాన కార్యదర్శి మద్దుమాల రవి, మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ పిల్లి కోటేశ్వరరావు, మున్సిపల్ కమిషనర్ శ్రీహరిబాబు, డీఈ అబ్దుల్ రహీమ్ పాల్గొన్నారు.



కూలిన చెట్టును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి: ఎమ్మెల్యే అరవిందబాబు

నరసరావుపేట రూరల్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ నేపథ్యంలో ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అవిందబాబు సూచించారు. ఎమ్మెల్యే అరవిందబాబు మంగళవారం మొంథా తుఫానుపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. తుఫాను ప్రభావంపై సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. రావిపాడు రోడ్డులో తుఫాను గాలులకు భారీ చెట్లు విరిగినపడి రహదారిపై అడ్డంగా నిలిచి రాకపోకలకు అంతరాయం కలిగింది. అరవిందబాబు అక్కడకు చేరుకుని ఆటంకాలు తొలగించి రాకపోకలు జరిగేలా చర్యలు తీసుకున్నారు.

ఆటో స్టాండ్ ఏర్పాటుకు కృషి చేస్తా: అరవిందబాబు

నరసరావుపేట రూరల్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రమైన నరసరావుపేట పట్టణంలో ఆటోస్టాండ్ ఏర్పాటుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు ఆటో డ్రైవర్లకు హామీ ఇచ్చారు. మంగళవారం ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు కార్యాలయానికి ఆటో డ్రైవర్లు వెళ్లి, ఆటో స్టాండ్ నిర్మాణం కోసం వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆటోడ్రైవర్లు ఉమ్మడి కూటమి నాయకులు పాల్గొన్నారు.



మిర్చి పొలాలను సందర్శించిన ఉద్యానవన శాఖ శాస్త్రవేత్తలు

మిరప పొలాలను సందర్శించిన శాస్త్రవేత్తలు

చిలకలూరిపేట, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): చిలకలూరిపేట మండలం గోవిందపురం, కావూరు గ్రామాలలో మిర్చి పొలాలను డాక్టర్ వైఎస్సార్ ఉద్యానవన విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు డాక్టర్ బి నాగేందర్‌రెడ్డి, డాక్టర్ జి క్రాంతి రేఖ, జిల్లా ఉద్యాన అధికారి ఐ వెంకట్రావు, చిలకలూరిపేట ఉద్యాన అధికారి ఆర్ శ్రీలక్ష్మి, కొమరవల్లిపాడు సొసైటీ అధ్యక్షుడు కోడె హనుమంతరావు మంగళవారం వర్షంలో సందర్శించి రైతులకు పలు సూచనలు చేశారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి: ఎస్ఐ శివరామకృష్ణ

యడ్లపాడు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన మొంథా తుపాను ప్రభావంతో ఈదురు గాలులతో కూడిన భారీ వర్షాలు పడే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఎవరూ ఇళ్ళ నుంచి బయటకు రావద్దని యడ్లపాడు ఎస్ఐ శివరామకృష్ణ మంగళవారం ఓ ప్రకటనలో కోరారు. విద్యుత్ సరఫరా నిలిచిపోయే అవకాశం ఉన్నందున ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని, తాగునీరు, ఆహారం, ప్రథమ చికిత్స సామగ్రిని ముందుగానే నిల్వ చేసుకోవాలని సూచించారు.

ఉన్నవలో షార్ట్ సర్క్యూట్‌తో పెంకుటిల్లు దగ్ధం

యడ్లపాడు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా పెంకుటిల్లు దగ్ధమైన సంఘటన మండలంలోని ఉన్నవలో మంగళవారం చోటుచేసుకుంది. సేకరించిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన పల్లపోతుల పోలిరాజు రోజువారీ కూలి. పోలిరాజు కుమారుడు ఇటీవల అయ్యప్ప మాల వేసుకుని స్థానిక ఆలయంలోనే మాలధారులతో కలసి ఉంటూ అక్కడే ఉంటున్నాడు. మంగళవారం ఉదయం పోలిరాజు ఇంటికి తాళంవేసి పనుల నిమిత్తం గుంటూరుకు వెళ్లగా కొద్దిసేపటికే ఇంటి నుంచి పెద్దఎత్తున పొగలు వచ్చాయి. గమనించిన చుట్టుపక్కల వారు అగ్నిమాపక అధికారులకు సమాచారం అందించగా సంఘటన స్థలానికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపులోకి తెచ్చారు. అయితే అప్పటికే ఇల్లు పూర్తిగా దగ్ధమైంది. ఇంట్లోని విలువైన ఎలక్ట్రానిక్ వస్తువులతోపాటు, నిత్యావసరాలు, బట్టలు అగ్నికి ఆహుతయ్యాయి.

బాధిత కుటుంబానికి సాయం అందజేత

ఉన్నవలో మంగళవారం జరిగిన విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధమై సర్వం కోల్పోయిన బాధిత కుటుంబాన్ని టీడీపీ సీనియర్ నాయకుడు, మాజీ జీడీసీసీ బ్యాంకు డైరెక్టర్ కుర్రా రత్తయ్య చేయూత అందించారు. రత్తయ్య బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. స్థానిక టీడీపీ నాయకుల సహాయ సహకారాలతో నిత్యావసరాలతోపాటు ఖర్చుల కోసం రూ.2వేలు నగదును బాధితుడు పల్లపోతుల పోలిరాజుకు అందజేశారు. కార్యక్రమంలో వీఆర్వో అశోక్, పంచాయతీ కార్యదర్శి జయబాబు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న రైతులు

అంతర్జాతీయ రైతు దినోత్సవం ర్యాలీ

వినుకొండ, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శివాపురంలో బర్లీ రైతుల అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం అంతర్జాతీయ రైతు దినోత్సవ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమానికి అసోసియేషన్ అధ్యక్షుడు మునిరికి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ సుస్థిర పొగాకు ఉత్పత్తి కోసం రైతులకు మంచి ఆదాయం వచ్చేలా ప్రణాళికలు రూపొందించడమే ధ్యేయమన్నారు. ఈ సందర్భంగా జరిగిన ర్యాలీలో పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.